

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 29.07.2025 | సంపుటి : 2 | సంచిక :176 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI Thuesday 29.07.2025 volume : 2 Issue : 176 Pages : 8 Cost : 2/-




## ఏ గుర్తింపు కార్డునైనా ఫోర్జరీ చేస్తారు కదా?

ఈసీకి సుప్రీం ప్రశ్న 04



11

## ఫిడే ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌గా దివ్య

అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



## తెలంగాణకు కొత్తగా నలుగురు జడ్జిలు

నియామక ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం 02



## విఐపిలు శ్రీవారి దర్శనాలు తగ్గించుకోవాలి

భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు 02



# ఢిల్లీలోనే తాడోపేడో తేల్చుకుంటాం

- బీసీ రిజర్వేషన్లపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం
- ఆగస్టు 5, 6, 7 తేదీల్లో ఆందోళనలకు కార్యాచరణ
- హస్తినకు వెళ్లనున్న సీఎం, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు
- బీసీల లబ్ధికి కట్టుబడి ఉన్నాం
- అసెంబ్లీలో మద్దతిచ్చి.. ఢిల్లీలో మోకాలడ్డుతున్న బీజేపీ
- మీడియాతో మంత్రులు పొన్నం, వాకిటి, కొండా సురేఖ
- ప్రతి బీసీ బిడ్డా ఢిల్లీకి తరలి రావాలని పిలుపు

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు కార్యాచరణను ఖరారు చేసింది. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో చేపట్టాల్సిన కార్యాచరణకు ఆమోదం తెలిపింది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా ఆగస్టు ఐదో తేదీన పార్టీ ఎంపీల ద్వారా పార్లమెంటు ఉభయ సభల్లో వాయిదా తీర్మానాలు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించింది.

**హైదరాబాద్, జూలై 28 :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై దిల్లీలోనే తేల్చుకోవాలని మంత్రి వర్గం నిర్ణయించింది. ఇందుకోసం సీఎం, మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలందరూ ఆగస్టు 5, 6, 7 తేదీల్లో దిల్లీకి తరలివెళ్లాలని తీర్మానించింది. రాష్ట్రపతిని కలిసి బిల్లుల ఆమోదం కోసం విజ్ఞప్తి చేయాలని, సానుకూల స్పందన రాకుంటే కాంగ్రెస్, ఇండియా కూటమి ఎంపీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని కార్యాచరణ సిద్ధం చేసింది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశం వివరాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. శాసనసభలో బిల్లులకు మద్దతు తెలిపిన భాజపా నాయకులు ఇప్పుడు మోకాలడ్డుతున్నారని, కడుపులో కత్తులు పెట్టుకుని మాట్లాడుతున్నారని వారు విమర్శించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ సీఎం, లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతలు అడుగుతున్నారని, మూడు రోజుల కార్యక్రమానికి రాష్ట్రం నుంచి మంత్రులు,

## భారత్ సత్తాకు నిదర్శనం

### 100కి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టాం

- మన సైనిక సత్తాను ప్రపంచమంతా గుర్తించింది
- ఉగ్రదాడికి ప్రతీకారంగానే ఉగ్రమూకలపై దాడి
- పాక్ దాడిని ప్రతిదాడితో ఘోరంగా దెబ్బతీసాం
- మన సైన్యం నిర్వహించిన పాత్ర అమోఘం
- లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో రాజ్‌నాథ్ సింగ్

పహల్గాంలో ఉగ్రదాడి హేయమైన చర్య అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మతం పేరు అడిగి మరీ పర్యాటకులను కాల్చి చంపారన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు భారత సైనికులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారని, పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాడులు జరిపారని అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌ను వణికించిన 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో వాడీవేడి చర్చ మొదలైంది.



04



## 'ఆపరేషన్ మహదేవ్'

జమ్మూకశ్మీర్‌లో ముగ్గురు పహల్గాం ఉగ్రవాదుల హతం 04



## గద్వాల పత్తి రైతులకు 700 కోట్ల బకాయిలు

- వెంటనే చెల్లించాలని విత్తన కంపెనీలకు ఆదేశం
- నెలలుగా బకాయిల చెల్లింపులో ఆలస్యంపై ఆగ్రహం
- మంత్రి జూపల్లితో కలసి సచివాయంలో మంత్రి తుమ్మల సమీక్ష

03

జోగులంబ గద్వాల జిల్లా పత్తి రైతులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను నెలలోగా చెల్లించాలని సీడ్స్ కంపెనీలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. అన్ని కంపెనీలు కలిపి సుమారు రూ.700 కోట్లు రైతులకు బకాయిలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతులు, వారిపై ఆధారపడిన రైతుకూలీలు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వారికి చెల్లించాలని బకాయిలను వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు.

# పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- గతేడాది పోలిస్తే పెరిగిన వినియోగం
- సరఫరాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్

గతేడాదితో పోల్చుకుంటే ఈ వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్నదని, రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశమున్నందున విద్యుత్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ విద్యుత్ అధికారులను ఆదేశించారు.

03









# బీహార్ ఓటర్ల జాబితా సవరణ

## పార్లమెంట్ ఆవరణలో విపక్షాల నిరసనలు

**న్యూఢిల్లీ, జులై 28 :** బీహార్ ఓటర్ల జాబితా సవరణ పై వరుసగా సోమవారం కూడా నిరసనలు కొనసాగాయి. అసాధారణ రీతిలో పార్లమెంట్ భవన ఆవరణలో పలు ప్రతిపక్ష పార్టీలు సవరణకు వ్యతిరేకంగా నిరసనలకు దిగాయి. ఈ ప్రదర్శనలో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, ఖర్గే, రాహుల్, ఎస్పి నాయకులు అఖిలేష్ యాదవ్ కూడా పాల్గొన్నారు. సర్ కటౌట్లను చింపివేశారు. సర్‌పేరిట వెలిసిన చెత్త బుట్టల్లో ముక్కలు పడేశారు. బీహార్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ మిషతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏకంగా ఎన్నికల పక్రియలో జోక్యం చేసుకుందని, ఎన్నికల సంఘం పావు అయిందని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. సోనియా , రాహుల్, ప్రియాంక, ఖర్గే ,టిఎంసి ఎంపిలు డెరెక్ ఓ బ్రెయిన్ , డిఎంకె ఎంపి కనిమొళి ఇతరులు ఈ పక్రియ ఉపసంహరణకు డిమాండ్ చేస్తూ నినాదాలకు దిగారు. వారికి ప్రతిపక్ష ఎంపీలంతా వంత పలికారు. దీనితో సభా ప్రాంగణం దద్దరిల్లింది. సర్‌తో ప్రజాస్వామ్య హననం అంటూ భారీ స్థాయిలో కటౌట్లను పట్టు-కుని ప్రతిపక్షాలు పార్లమెంట్ ఆవరణలో ప్రదర్శనకు దిగాయి. దీనితో భద్రతా సిబ్బంది అప్రమత్తం కావల్సి వచ్చింది. స్టాప్ సర్ అంటూ ప్రతిపక్షాలు పార్లమెంట్ ఆవరణలో నిరసనకు దిగడం ఇది ఐదోరోజు అయింది. పార్లమెంట్ మకరద్వారం వద్ద ప్రతిపక్ష ఎంపీలు గుమికూడారు. కాంగ్రెస్, టిఎంసి, డిఎంకె, ఆర్జేడీ, వామపక్షాల ఎంపిలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. దీనితో ఇండియా కూటమి సంఘటిత వైఖరి స్పష్టం అయింది. ఈ నిరసనలలో ఆప్ ఎంపిలు కన్పించలేదు. అణగారిన వర్గాల ఓటు- హక్కును హరించివేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందని, దీనిని అడ్డుకుని తీరుతామని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. పార్లమెంట్ ఉభయసభల్లోనే కాకుండా వెలుపల కూడా ప్రతిపక్షాలు తమ నిరసనలను ఉధృతం చేయడంతో సర్ వ్యవహారం ఇక ఎటు నుంచి ఎటు దారితీస్తుందనేది వెల్లడికాని పరిస్థితి ఏర్పడింది. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై ఆర్‌ఎస్‌ఎస్ బిజెపిల ఉమ్మడి మనువాద భావాల దాడికి అనుమతించేది లేదని విపక్షాలు స్పష్టం చేశాయి. సర్ ఓట్ల చోరీకి రూపొందించిన ప్రమాదకర దొడ్డిదారి. ప్రజాస్వామిక రాజ్యాంగ విలువలపై ప్రత్యక్ష దాడి అని రాహుల్ గాంధీ ఎంపిల ప్రదర్శన దశలో తెలిపారు. ప్రతిపక్షం అంతా సంఘటితంగా వ్యవహరించాలి. ఈ కుట్రను అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ పక్రియను నిలిపివేసే వరకూ ప్రతిపక్షాల నిరసనలు ఆగబోవని ఆయనఫేస్‌బుక్ ద్వారా ప్రకటించారు.

### పాక్‌తో కాల్పుల విరమణలో

# మూడో వ్యక్తి లేడు

## ట్రంప్ జోక్యంపై పరోక్షంగా లోక్‌సభకు జైశంకర్ వివరణ

**న్యూఢిల్లీ, జులై 28 :** భారత్-పాక్ మధ్య ఇటీవల జరిగిన కాల్పుల విరమణలో అమెరికా ప్రమేయం ఎంతమాత్రం లేదని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారం ప్రత్యేక చర్చలో జైశంకర్ పాల్గొంటూ.. కాల్పుల విరమణకు సంబంధించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదని చెప్పారు. అమెరికా మధ్యవర్తిత్వంపై వస్తున్న ఊహాగానాలను కొట్టివేశారు. ఏప్రిల్ 22- జూన్ 17 మధ్య ప్రధానమంత్రి మోదీ, డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ కాల్ సంభాషణలు జరగలేదని సభకు వివరించారు. భారత్-పాక్ మధ్య డైరెక్ట్ కమ్యూనికేషన్ అనంతరమే కాల్పుల విరమణపై అవగాహనకు వచ్చినట్టు- చెప్పారు. ఇందులో మూడో పార్టీ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ కాల్పులపై భారత్ విరుచుకుపడటంతో కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నాంటూ పాక్ నుంచి భారత ప్రభుత్వానికి ఫోన్ కాల్స్ వచ్చాయని, అయితే ప్రొటోకాల్ ప్రకారం ఇలాంటి సమాచారం అధికారికంగా పాకిస్థాన్ డీజీఎంఓ నుంచి రావాలని ఇండియా పట్టు-పట్టిందని జైశంకర్ సభకు తెలిపారు. లష్కరే తొయిబా ప్రాక్సీ అయిన ది రెసిస్టెంట్ ఫ్రంట్ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించడం వెనుక భారత దౌత్యానికి క్రెడిట్ దక్కుతుందని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదానికి చిరకాలంగా పాకిస్థాన్ మద్దతిస్తున్న విషయాన్ని ఇండియా బలంగా ప్రపంచ దేశాల ముందుకు తీసుకువెళ్లిందన్నారు. ప్రపంచానికి పాకిస్థాన్ నిజస్వరూపం వెల్లడించడంలో సక్సెస్ అయ్యామని చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సహించేది లేదనే విధానాన్ని ఇండియా అనుసరిస్తోందన్నారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై పోరు కేవలం ఆపరేషన్ సిందూర్‌కు పరిమితం కాదని, దేశ ప్రజలు, వారి ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని చెప్పారు. జాతీయ భద్రతపై భారత్ దృఢ వైఖరి కొనసాగిస్తుందని, పాకిస్థాన్ జాతీయులకు వీసా ఆంక్షలు కొనసాగుతాయని వివరించారు. ఉగ్రవాదం ముప్పును ఎదుర్కొనేందుకు అనుసరిస్తు విస్తృత వ్యూహంలో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# బాలాపూర్‌లోని ప్లాస్టిక్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

**హైదరాబాద్, జులై 28 :** బాలాపూర్ లోని ప్లాస్టిక్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారు జామున అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ప్రమాదం జరిగినప్పుడు ఘటనా స్థలంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. భారీగా ఆస్తినష్టం జరిగినట్టు- సమాచారం. షార్ట్ సర్క్యూట్ తోనే ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. ప్లాస్టిక్ పరిశ్రమకావడంతో త్వరగా మంటలు అంటుకున్నాయి.

# గోల్కొండ పరిధిలో చిరుత

## సిసి కెమెరాకు చిక్కిన దృశ్యాలు

**హైదరాబాద్, జులై 28 :** నగర శివార్లలోని గండిపేట్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు గతవారం రోజులుగా చుక్కలు చూపిస్తున్న చిరుత గోల్కొండ ఆర్మీ పరిధిలోని ఇబ్రహీంబాగ్‌లో ప్రత్యక్షమయ్యింది. లంగర్‌హౌజ్-నార్సింగి ప్రధాన రహదారిలో ఆర్మీ సెంటర్ సమీపంలో ఆదివారం రాత్రి చిరుతపులి రోడ్డు దాటుతుండగా గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించగా, సిసి కెమెరాలను పరిశీలించి నిర్ధారణ చేసుకున్న పోలీసులు పరిసర ప్రాంతాలప్రజలను అప్రమత్తం చేశారు. గతవారం రోజులక్రితం మంచిరేవులలో ఓ కొండపై చిరుతపులి కూర్చోగా, సమీపంలోని ఓ విల్లా వాసులు గమనించి ఫోటోలు తీసి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో రంగంలోకి దిగిన అటవీశాఖ అధికారులు గ్రేహౌండ్స్ సమీపంలో 4 బోన్‌లు, సిసి కెమెరాలను ఏర్పాటు-చేశారు. వారంరోజులుగా పరిసర ప్రాంతాల్లో వెదికినా చిరుతపులి ఆచూకి లభించలేదు. అయితే, ఆదివారం రాత్రి ఇబ్రహీంబాగ్ సమీపంలో ప్రధాన రోడ్డు దాటుతుండగా ప్రయాణికుల కంటబడింది. దీంతో స్థానికప్రజలు ఆందోళన చెందుతున్నారు. మంచిరేవుల, బైరాగిగూడ, నార్సింగి,ఇబ్రహీంబాగ్ పరిసర ప్రాంతాల్లోనే చిరుతపులి సంచరిస్తున్నట్లు-గా అటవీ శాఖ అధికారులు వలవేసి పట్టు-కునేందుకు మరిన్ని బోన్‌లు ఏర్పాటు-చేస్తున్నారు. పరిసర ప్రాంతాల ప్రజలూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు,అటవీశాఖ అధికారు లు హెచ్చరిస్తున్నారు. చిరుతపులి సంచారం మంచిరేవుల,నార్సింగి వాసులకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. మంచిరేవుల సమీపంలో ఉన్న పార్కుసైతం తాళం వేశారు.

# ఢిల్లీలోనే తాడోపేడో తేల్చుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరూ కలిసి ఢిల్లీ వెళ్తామన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం చేస్తున్న పోరాటానికి బీసీ మేధావులు, సంఘాలు, రిజర్వేషన్లు కోరుకుంటున్నవారంతా కలిసి రావా లని విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50 శాతం పరిమితి దాటిపోయిందన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ సామ, దాన, భేద, దండోపాయాల పద్ధతిలో ముందుకువెళుందని, కేంద్రం సానుకూ లంగా స్పందించకుంటే నిరసన తెలియజేస్తామని వారు పేర్కొన్నారు.

### బీసీల లబ్ధికి కట్టుబడి ఉన్నాం..

"రాష్ట్రంలో బీసీలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి ఆర్డినెన్సు వరకు వారికి న్యాయం చేసేందుకు ప్రయత్నం చేస్తోంది. ఈ ఏడాది మార్చి 17న ప్రభుత్వం రెండు బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టింది. ఇందులో ఒకటి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించింది కాగా... మరొకటి విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేది. వీటిని అన్ని రాజకీయ పార్టీల సహకారంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదింపజేశారు. బిల్లులను మార్చి 22న గవర్నర్‌కు పంపించగా... వాటిని రాష్ట్రపతి ఆమోదం కోసం ఆయన మార్చి 30న పంపించారు. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు, రాష్ట్రపతి సకాలంలో నిర్ణయాలు తీసుకోవాలన్న సుప్రీంకోర్టు, మద్రాస్ హైకోర్టు తీర్పులను పరిశీలిస్తున్నాం. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి. తెలంగాణ ఏర్పాటైన తరువాత అప్పటి సీఎం కేసీఆర్.. 2018 పంచాయతీ చట్టం ప్రకారం రిజర్వేషన్లు 50 శాతంలోపు ఉండాలన్న నిబంధన చేర్చారు. దాన్ని సవరిస్తూ 50 శాతం పరిమితిని ఎత్తివేస్తూ జులై 10న మా ప్రభుత్వం ఆర్డినెన్సు ముసాయిదా జారీ చేసింది. దాన్ని గవర్నర్‌కు జులై 14న పంపించాం.

### రాష్ట్రపతికి చేరిన ఆర్డినెన్స్ ముసాయిదా!

స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రివర్గం సిఫార్సు చేసిన ఆర్డినెన్స్ ముసాయిదాను గవర్నర్ గత శనివారం రాష్ట్రపతికి పంపినట్లు తెలిసింది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం... స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అంశం మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చినపుడు ఆర్డినెన్స్ ముసాయిదాను గవర్నర్ శనివారం రాష్ట్రపతి పరిశీ లనకు పంపించినట్లు అధికారులు తెలిపారు. దీనిపై సుదీర్ఘ చర్చ అనం తరం... ముఖ్యమంత్రి, మంత్రులు సహా అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒదరూ మూడు రోజుల పాటు ఢిల్లీలో మకాం వేసి రాష్ట్రపతిని కలిసి ఆమోదం తెలపాలని కోరాలని, ఇతరత్రా ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై 90 రోజుల్లోపు ఏదో ఒక నిర్ణయం వెలువరించకపోతే ఆమోదం తెలిపినట్లుగానే భావించాల్సి ఉంటుందని ఇటీవల తమిళనాడుకు సంబంధించిన బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపైనా మంత్రివర్గం చర్చించినట్లు సమాచారం. అయితే అది ఆ కేసు వరకే పరిమితమన్న అంశం తీర్పులో ఉందని అధికారులు చెప్పినట్లు తెలిసింది.

### ఎన్నికలు నిర్వహించాలని కోర్టు చెప్పింది...

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు హైకోర్టు గడువు విధించింది. మరోవైపు కేంద్రం నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు రావడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం జోక్యం చేసుకుని బిల్లులను ఆమోదింపజేయాలని కోరుతున్నాం. భాజపా కార్యకర్తలతో పాటు ఆ పార్టీకి చెందిన బీసీ ఎంపీలు అర్వింద్, బండి సంజయ్, ఈటల రాజేందర్, ఆర్.కృష్ణయ్య, లక్ష్మణ్ కలిసి రాష్ట్రపతి వద్ద బిల్లులను ఆమోదింపజేయాలి. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతున్నారు. శాసనసభలో బిల్లులకు భాజపా సహకరించింది. ఇప్పుడు కాదంటోంది. బిల్లులకు సహకరించేందుకు వీలుకాకుంటే రాజీనామా చేయాలి" అని మంత్రులు డిమాండ్ చేశారు.

# మోడీ కాదు.. రాహుల్ కన్వర్టెడ్

- కులగణన అంతా తప్పుల తడక
- రాబోయే ఎన్నికల్లో బిసిలకు పెద్దపీట వేస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్, జులై 28 :** మోడీని కన్వర్టెడ్ బీసీ అని సీఎం రేవంత్ విమర్శలు చేయడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ కన్వర్ట్ అయ్యారు.. మోడీ కాదు అని ఆయన విమర్శించారు. కేసీఆర్ గతంలో ఎంబీసీ చైర్మన్ పెట్టి రూ.1000 కోట్లు- కేటాయిస్తామ న్నారు. కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, కేసీఆర్.. సమగ్ర కుల సర్వే చేశాడు.. కానీ నివేదిక బయటపెట్టలేదన్నారు. తెలంగాణలో బీసీలు 52 శాతానికి పైగా ఉన్నారని, కులగణన కొన్ని మండలాల్లో జరగనే లేదు.. ఎలా పూర్తిచేశారన్నారు. నిజంగానే రాష్ట్ర ప్రభుత్వం చేస్తే నిజాలు ఎందుకు బయపెట్టడంలేదని, అందుకే కేంద్ర ప్రభుత్వం జన గణనతో పాటు- కుల గణన కూడా చేపట్టనుందన్నారు. అందులో వాస్తవాలు చెప్పి దాని ప్రకారం సంక్షేమ పథకాలు ఇంప్లిమెంట్ చేస్తామని, రాజ్యాంగం మారుస్తారని, ఎస్సీలకు రిజర్వేషన్లు ఎత్తేస్తారని అమిత్ షా మాట్లాడినట్లు- కాంగ్రెస్ సృష్టించిందన్నారు రాంచందర్ రావు. ఈ కేసు సీఎంపైనే ఉందని, రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఇచ్చినా ఇవ్వకున్నా.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తామని, 42 శాతం పక్కాగా ఓన్లీ బీసీలకే ఇస్తామన్నారు. కాంగ్రెస్ చెబుతున్నట్లుగా వాటిలో కూడా 10 శాతం ముస్లింలకు ఇవ్వబోమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, బీసీలకు లబ్ధి చేకూర్చేలా కేంద్రం ముందుకు వెళ్తుంటే తమకు నష్టమని భావించి కాంగ్రెస్ దుష్ప్రచారాలకు దిగుతోందని ఆయన మండిపడ్డారు. ఎలక్షన్స్ ముందు సీఎం రేవంత్ ఇచ్చిన స్టేట్ మెంట్లు బయటపెడతాం.. ఆయన ఏం మాట్లాడాడో బయటపెడతామని ఆయన వ్యాఖ్యానించారు. బీసీల సంక్షేమంపై కాంగ్రెస్ చేసేదంతా యాక్టింగే అని, వచ్చేనెల 2వ తేదీన ధర్నా చౌక్ వద్ద బీసీ రిజర్వేషన్లపై మహాధర్నా నిర్వహిస్తున్నామ న్నారు. బీసీల సంక్షేమం గురించి ఆలోచించే పార్టీ బీజేపీ మాత్రమే అని, కాంగ్రెస్ కేవలం ఓట్ల కోసమే ఆలోచిస్తుంది.. కానీ బీజేపీ ప్రజా సంక్షేమం గురించి ఆలోచిస్తుందన్నారు రాంచందర్ రావు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడంలో బీసీల పాత్ర కీలకం.. వారికి అంతేస్థాయిలో ప్రయారిటీ- ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

# యువకుడు ఆత్మహత్యాయత్నం

- మాటల్లో పెట్టి కాపడిన హైడ్రా సిబ్బంది
- అభినందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, జులై 28 :** దుర్గంచెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని చాకచక్యంగా కాపాడిన హైడ్రా డీఆర్‌ఎఫ్ సిబ్బంది తిరుపతియాదవ్, సంతోష్‌చారి, మహ్మద్ ఇమ్రాన్‌లను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించారు. ఈ నెల 25న రామిరెడ్డి అనే యువకుడు దుర్గంచెరువు తీగల వంతెన అంచున నిలబడి చెరువులోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించగా.. అక్కడే విధుల్లో ఉన్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది కాపాడింది. రామిరెడ్డిని మాటల్లోపెట్టి.., దృష్టి మరల్చి.. క్షణాల్లో కాపాడిన తిరుపతి యాదవ్‌ను కమిషనర్ అభినందించారు. అక్కడే విధుల్లో ఉండి.. యువకుడిని కాపాడేందుకు సహకరించిన సంతోష్ చారి, మహ్మద్ ఇమ్రాన్‌లను కూడా శాలువ కప్పి సన్మానించారు. దుర్గం చెరువు వంతెనపై వీరు నిలుచుండగా.. రంధ్రాలను శుభ్రం చేస్తున్నప్పుడు ఓ యువకుడు దూకేందుకు యత్నిస్తున్న దృశ్యాలను చూశామని.. ఒకవైపు అతిడిని దూకకుండా మాటల్లో పెట్టి... మరో వైపునుంచి వచ్చి కాపాడినట్టు- ఆ ముగ్గురు డీఆర్ ఎఫ్ ఉద్యోగులు కమిషనర్‌కు వివరించారు.

# ఫార్మా భూములపై హామీ

## ఎమ్మెల్యేల మల్‌రెడ్డి ఇంటిముందు రైతుల ధర్నా

**హైదరాబాద్, జులై 28 :** ఎన్నికల్లో ఫార్మా భూములపై ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటిని రైతులు ముట్టడించారు. దిల్‌షుక్‌నగర్‌లోని తిరుమలహిల్స్‌లోని ఎమ్మెల్యే ఇంటి ముందు యాచారం మండలానికి చెందిన 300 మంది బాధిత రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్లే కార్డులు పట్టు-కుని రైతులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి,ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వ్యతిరేకంగా పెద్ద నినాదాలు చేస్తూ, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేర్చేవరకు ఇక్కడినుంచి వెళ్లేదిలేదని నిరసనకు దిగారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ-ని రద్దుచేస్తామని, ఫార్మా బాధిత రైతులకు భూములను తిరిగి ఇస్తామని ఎమ్మెల్యే రంగారెడ్డి హామీ ఇచ్చారని,అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా నేటికి సమస్యలను పరిష్కరించలేదని రైతులు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫార్మాసిటీ-పై స్పష్టమైన ప్రకటన చేయాలని, ఫార్మాకు ఇవ్వని 2500 ఎకరాల భూమిని తిరిగి రైతుల పేరును ఆన్‌లైన్‌లో ఎక్కించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితా నుంచి ఈ భూములను వెంటనే తొలగించాలన్నారు. రైతులకు రైతు భరోసా,రైతు బీమా,పంట రుణం,రు-ణమాఫీలతో పాటు తమ భూములను అమ్ముకునేం దుకుగాను రిజిస్ట్రేషన్‌ల పక్రియకు అనుమతించాలని రైతులు డిమాండ్ చేశారు. ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త కె.సరస్వతి, నాయకులు గణేష్, నిరంజన్, నారాయణ పాల్గొన్నారు.

# దళిత యువకుడి దారుణ హత్య

## ప్రేమ వ్యవహారమే కారణం

**చెన్నై, జులై 28 :** తమిళనాడులో 27 ఏళ్ల దళిత యువకుడిని దారుణంగా హత్య చేశారు. తూత్తుకుడికి చెందిన కవిన్ తిరునెల్వేలిలోని ఓ ప్రైవేటు- ఆస్పత్రి సమీపంలో హత్యకు గురయ్యాడు. కవిన్ ఒక ఐటీ- సంస్థలో పని చేస్తున్నాడు. అతడు కెటిసి నగర్‌లోని ఒక ప్రైవేటు- ఆస్పత్రిలో పని చేస్తున్న తన మాజీ స్కూల్ విద్యార్థిని రిలేషన్‌లో ఉన్నట్లు- సమాచారం. అయితే వీరిద్దరి వివాహానికి అమ్మాయి కుటు-ంబసభ్యులు అంగీకరించలేదు. కానీ, కవిన్ మాత్రం ఆ అమ్మాయినే పెళ్లి చేసుకువాలని పట్టు-దలతో ఉండేవాడు. దీంతో ఆదివారం ఆమెను కలిసేందుకు ఆమె పని చేస్తున్న ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ ఉన్న అమ్మాయి సోదరుడు సుర్జీత్.. కవిన్‌ని అడ్డుకున్నాడు. దీంతో వీరిద్దరి మధ్య కొంత సేపు వాగ్వాదం జరిగింది. కోపం భరించలేకపోయిన సుర్జీత్.. ఆస్పత్రికి 200 మీటర్ల దూరంలో కవిన్‌ను కొడవలితో నరికి హత్య చేసి అక్కడి నుండి పారిపోయాడు. ఆ తర్వాత పాలయంకొ-ట్టై పోలీసు స్టేషన్‌కి వెళ్లి సుర్జీత్ లొంగిపోయాడు. అయితే తమకు న్యాయం జరిగే వరకూ మృతదేహాన్ని తీసుకోమని కెవిన్ కుటు-ంబసభ్యులు ఆందోళన చేశారు. సుర్జీత్‌తో పాటు- పోలీస్ శాఖలో పని చేస్తున్న అతడి తండ్రి శరవణన్, తల్లి కృష్ణకుమారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని వాళ్లు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రేమవ్యవహారంలో అక్కను చంపిన తమ్ముడు

**రంగారెడ్డి, జులై 28 :** పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి మందలించిన యు-వకుడు ఆ అమ్మాయికి తిరిగి ఫోన్ చేయడమే పాపమైంది. నలుగురిలో మన పరువు తీసినవాడు ఫోన్ ఎందుకు చేశాడని ఆగ్రహించిన తమ్ముడు అక్కను హత్య చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన దేశాల రాఘవేందర్ మేస్త్రీ పనులు చేస్తూ కుటు-ంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే రాఘవేందర్ కుమార్తె రుచిత (21) అదే గ్రామానికి చెందిన ఈర్లపల్లి దినేష్ ప్రేమించింది. ఈ విషయమై పంచాయతీ పెట్టి ఇకపై అమ్మాయితో మాట్లాడవద్దని ఒప్పందం చేసుకున్నారు. అయితే రుచితకు దినేష్ ఫోన్ చేసి మాట్లాడుతుండగా గమనించిన ఆమె తమ్ముడు రోహిత్ మన పరువు తీసినవాడితో ఎందుకు మాట్లాడుతున్నావని ప్రశ్నించగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు-చేసుకుంది. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన తమ్ముడు అక్క రుచితను చంపి ఉంటాడని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని వెళ్లిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జూరాల 12 గేట్లు ఎత్తివేత

**గద్వాల, జులై 28 :** జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల జలాశయానికి ఇన్ ఫ్లో 1,00,257 వేల క్యూసెక్కులుండగా ఔట్ ఫ్లో 92,556 క్యూసెక్కులుగా ఉంది. జూరాల ప్రాజెక్టు 12 గేట్లు- ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318.816 మీటర్లు ఉండగా ప్రస్తుత నీటి నిల్వ 317.170 మీటర్లుగా ఉంది. జూరాల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 7.795 టిఎంసిలుండగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థం 9.657 టిఎంసిలుగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి ఐదు కేంద్రాలలో కొనసాగుతోంది.



# విఐపిలు శ్రీవారి దర్శనాలు తగ్గించుకోవాలి

## భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**తిరుమల, జులై 28 :** సామాన్య భక్తుల సౌలభ్యం కోసం వీఐపీలు ఏడాదికి ఒకసారి మాత్రమే తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. సోమవారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆయనకు రంగ నాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ ఆలయంలో స్వామివారి దర్శనానికి ఉండే స్థలం, సమయం పరిమితంగా ఉండటంతో బయట ఎంత మంచి ఏర్పాట్లు- చేసినప్పటికీ భక్తుల రద్దీ కారణంగా సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో వీఐపీలు ఏడాదికోసారి మాత్రమే పరిమిత సంఖ్యలో కుటు-ంబ సభ్యులను తీసుకువస్తే దేవస్థానం నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధులం దరూ భాద్యతతో హుందాగా ఈ సూచనను పాటించాలని తెలియజేశారు.

### ఎంబీబీఎస్ సీట్ల స్థానికతపై

# హైకోర్టు కీలక తీర్పు

**హైదరాబాద్, జులై 28 :** ఎంబీబీఎస్ సీట్ల స్థానికతపై తెలంగాణ హైకోర్టు కీలక తాత్కాలిక తీర్పును ఇచ్చింది. కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్ కౌన్సెలింగ్ దరఖాస్తుదారులను స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు ఆదేశించింది. తుది తీర్పు వచ్చే వరకు రిజిస్ట్రేషన్‌లో చేర్చాలని ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు తీర్పుతో సుమారు 100 మంది అభ్యర్థులకు తాత్కాలిక ఊరట లభించింది. జూలై 30వ తేదీతో రిజిస్ట్రేషన్ ముగియనుండటంతో హైకోర్టు ఈ కీలక తీర్పు నిచ్చింది. శాశ్వత నివాసం తోనూ స్థానికత మంజూరు చేయాలని కోర్టు అభిప్రాయపడింది. గత ఏడాది ఇచ్చిన హైకోర్టు ఆర్డర్స్ ఫాలో కావాలని ఆదేశించింది. కాగా, జూలై 15వ తేదీన విడుదలైన ప్రాస్పెక్టస్, నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి.

### తెలంగాణకు కొత్తగా

# నలుగురు జడ్జిలు

**హైదరాబాద్, జులై 28 :** తెలంగాణ హైకోర్టుకు మరో నలుగురు కొత్త జడ్జిలు రానున్నారు. దేశవ్యాప్తంగా పలు హైకోర్టులకు సోమవారం 19మంది జడ్జీలు, అదనపు జడ్జీలు నియమితులయ్యారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కోలీజియం సిఫారసులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. వీరి నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో న్యాయ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. కాగా, 19 మందిలో తెలంగాణ హైకోర్టుకు నలుగురు జడ్జీలను నియమించారు. గాడి ప్రవీణ్‌కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్ లు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణం చేయనున్నారు. తెలంగాణతోపాటు- మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఏడుగురు జడ్జీలు, నలుగురు అదనపు జడ్జీలు.. ఇక, అస్సాం హైకోర్టుకు నలుగురు జడ్జిలను నియమితులయ్యారు.



# గరిష్ఠ స్థాయికి సాగర్ నీటిమట్టం

## నేడు నీటి విడుదల

**నల్గొండ :** ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం నుంచి భారీగా వరదనీరు వస్తుండటంతో నాగార్జునసాగర్ జలాశయం జలకళతో తొణికిసలాడుతోంది. గతానికి భిన్నంగా జులై నెలలోనే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. ఇలా జరగడం 18 సంవత్సరాల తర్వాత ఇదే మొదటిసారి. సాధారణంగా ఆగస్టులో సాగర్ నిండుతుంది. పైనుంచి వరద కొనసాగుతుండటంతో అధికారులు మంగళవారం 6 క్రస్ట్ గేట్ల ద్వారా 50 వేల క్యూసెక్కుల నీటిని ముగ్గురు మంత్రుల చేతుల మీదుగా విడుదల చేయనున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం ప్రకారం... శ్రీశైలం నుంచి 1,47,195 క్యూసెక్కుల వరదనీరు సాగర్‌కు చేరడంతో నీటిమట్టం 584.70 అడుగులకు చేరింది. ప్రాజెక్టు కుడికాల్వ ద్వారా 5,394 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,634 క్యూసెక్కులు, ప్రధాన విద్యుత్ కేంద్రం ద్వారా 28,785 క్యూసెక్కులు, ఎస్‌ఎల్బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల చొప్పున మొత్తంగా 42,613 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటి నిలువ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా ప్రసుత్తం 296.56 టీఎంసీల నీరుంది. నాగార్జునసాగర్ నీటిమట్టం మంగళవారం ఉదయం 10 గంటలకు 586 అడుగులను దాటే అవకాశముంది. ఈ నేపథ్యంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కలిసి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు.

# పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- గతేడాది పోలిస్తే పెరిగిన వినియోగం
- సరఫరాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్



**హైదరాబాద్, జులై 28 :** గతేడాదితో పోల్చుకుంటే ఈ వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్నదని, రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశమున్నందున విద్యుత్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ అధికారులతో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మిట్టల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి విద్యుత్ శాఖకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, విద్యుత్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలతో పాటు గృహ రంగంలో కూడా భారీ వినియోగం నమోదవుతుంది. దీనికి తోడు, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండటంతో లక్షలాది మోటర్లు నిరంతరం నడుస్తున్నాయి. ఫలితంగా వర్షాల సీజన్‌లో కూడా భారీగా డిమాండ్ నమోదవుతున్నది. గతేడాదిజులై 31 న 13541 మెగావాట్లుగా నమోదయిన గరిష్ట డిమాండ్ ఈ ఏడాది జులై 16న 14.05 శాతం పెరుగుదలతో 15443 మెగావాట్లు–గా నమోదయ్యిందన్నారు. పుష్కలంగా వర్షాలు పడుతుండటంతో నీటి లభ్యత బాగా పెరిగింది. వరి నాట్లు జోరందుకోవడంతో రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో సీఎండీ స్థాయి నుండి కింది స్థాయి సిబ్బంది వరకు అప్రమత్తంగా వుంటూ ఎలాంటి అవాంతరాలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈ వర్షాల సీజన్ లో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వుంటూ, వర్షాలు కురిసేటప్పుడు తప్పనిసరిగా తమ కార్యాలయాల్లో అందుబాటులో వుంటూ సరఫరా పర్యవేక్షించాలని నవీన్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్లు డా. నర్సింహులు, చక్రపాణి, కృష్ణా రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.



## ఖమ్మం జిల్లా పర్యాటక అభివృద్ధికి పెద్దపీట

**అధికారులతో సమీక్షలో మంత్రులు తుమ్మల, జూపల్లి**

**హైదరాబాద్, జులై 28 :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న వివిధ చారిత్రక ప్రదేశాలను అభివృద్ధి పరిచి టూరిజం సెక్టార్‌ను బలోపేతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, హార్టికల్చర్, హ్యాండ్లూమ్ టెక్స్ టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, ప్రొహిబిషన్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం కార్పొరేషన్ ఎం.డి. వల్లూరి క్రాంతి, జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో ఏకో, టెంపుల్ టూరిజంలను అభివృద్ధిపరిచే ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. పాలేరు రిజర్వాయర్, నేలకొండపల్లి వద్ద ఉన్న బౌద్ధస్థూపం, పర్ణశాల, భద్రాచలం టెంపుల్, కిన్నెరసాని ప్రాజెక్టు, కొత్తగూడెం వద్ద హరితహోటల్, కనిగిరిహిల్స్, వైరా రిజర్వాయర్, వెలుగుమట్ల అర్బన్ పార్కు, ఖమ్మం ఖిల్లా వద్ద రోప్‌వే, ఖమ్మంలో కొత్తగా ఒక హరిత హోటల్‌లను నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం పట్టణ సమీపంలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రదేశంలో ఏకో టూరిజంకు సంబంధించిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా ఖమ్మం పట్టణంలో హరిత హోటల్ నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, కొత్తగూడెంలో ఉన్న హరితహోటల్ ని అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు.



## గిరిజనుల సంక్షేమం లక్ష్యంగా నిర్ణయాలు

- అభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి సలహాలు
- గిరిజన సలహా మండలి సమావేశంలో మంత్రి అడ్లూరి

**హైదరాబాద్, జులై 28 :** గిరిజన సలహా మండలి గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి సలహాలిస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ సమావేశం ద్వారా ఆయా లక్ష్యాలను సాధించడం ద్వారా గిరిజనులకు న్యాయం చేసే అవకాశం దక్కిందని అన్నారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ గిరిజన సంక్షేమ శాఖలో సోమవారం 7వ గిరిజన సలహా మండలి సమావేశం జరిగింది. రాజ్యాంగ బద్ధమైన ఈ సలహా మండలిలో 16 అజెండా అంశాలతో పాటు పలు అదనపు అజెండా అంశాల మీద చర్చ జరిగింది. ఎస్సీ ఎస్టీ మైనారిటీ వికలాంగుల శాఖామాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని అందరు గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, –టైకార్, జేసీసీ ఛైర్మన్లు పాల్గొన్నారు. ఈసమావేశంలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఏర్పాటైన సలహా మండలి సభ్యులు చర్చించి సలహాలిచ్చిన అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకున్నామని, అందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. సభ్యులు ఇంకా కొత్త అజెండాలు ఇస్తే వాటిని తర్వాత వచ్చే గిరిజన సలహా మండలి అజెండా అంశాలుగా చేరుస్తామన్నారు. ఈ రోజు చర్చించిన అంశాలు కొన్నింటిని పరిష్కరించుకోవడానికి ప్రధానమంత్రి సమయం తీసుకొని కలుస్తామన్నారు. సమావేశంలో పాల్గొన్న పంచాయితీరాజ్ శాఖామాత్యులు డా. దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో గిరిజనులందరికీ అవసరాన్నిబట్టి కేటాయింపులు జరగాలని, ప్రత్యేకించి ఆదిమవాసులకు ప్రత్యేక వెసులుబాట్లు కల్పించాలని, ఐటీడీఏలను బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉప సభాపతి రామచంద్రు నాయక్, ఎంపీలు గొడం నగేశ్, బలరాం నాయక్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా. ఎ. శరత్, అదనపు సంచాలకులు వి. సర్వేశ్వర్ రెడ్డి, గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకులు డా. వి. సముజ్వల తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సిగాచీ మృతుల కుటుంబాలకు అందని సాయం

- కోటి పరిహారం ప్రకటించినా బాధితులకు దక్కలేదు : మాజీ మంత్రి హరీశ్‌రావు



**సంగారెడ్డి, జులై 28 :** సిగాచీ బాధిత కుటుంబాలకు ఇప్పటికీ పరిహారం అందలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిగాచీ ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన సంగారెడ్డి అదనపు కలెక్టర్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "సిగాచీ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ. 1 కోటి పరిహారం ఇచ్చే విషయాన్ని సీఎం ప్రకటించారు. కానీ రోజులు గడిచినా ఎవరూ పట్టించుకోలేకపోతున్నారు. పరిహారం అందలేదని బాధిత కుటుంబాలు ఆందోళనలో ఉన్నాయి. ఎప్పుడు పరిహారం ఇవ్వాలని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారు. కొన్ని కుటుంబాలకు 1 లక్ష పరిహారం మాత్రమే అందింది. ఇంకా మృతుల, క్షతగాత్రుల వివరాలు అధికారికంగా ప్రకటించలేదు. ఎంత మందికి పరిహారం ఇచ్చారో కూడా అధికారికంగా చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిగాచీ పరిశ్రమలో జరిగిన పేలుళ్లలో 54 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటన జరిగిన నెల రోజుల తర్వాత కూడా బాధిత కుటుంబాలకు పరిహారం అందకపోవడం ఆవేదనకు గురిచేస్తున్నట్లు హరీశ్‌రావు చెప్పారు. సోమవారం ఆయన బాధిత కుటుంబాలతో కలిసి సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. అక్కడ అదనపు కలెక్టర్‌ను కలిసి, మృతదేహాల అందజేత, పరిహారం చెల్లించడంలో ప్రభుత్వ వైఫల్యంపై నిలదీశారు. "సిగాచీ ఘటనకు నెల రోజులు గడిచింది. బాధిత కుటుంబాలు కన్నీళ్ల మధ్య జీవనోపాధి కోసం పోరాటం చేస్తున్నారు. ఘటన జరిగినప్పుడు సీఎం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు, కానీ ఇప్పటివరకు ఎవరూ ఎక్స్‌గ్రేషియా అందలేదు. అంతిమ కార్యక్రమాల కోసం శవాలు కూడా ఇవ్వలేదు. బాధితులు బూడిద తీసుకువెళ్లి గోదావరిలో కలిపి పెట్టారని కన్నీళ్ళతో పేర్కొన్నారు" అని హరీశ్‌రావు చెప్పారు. "ఇది దురదృష్టకరమైన పరిస్థితి. 54 మంది మరణించడం, 100 మందికి పైగా గాయపడటం, ప్రభుత్వ స్పందన అత్యంత దయనీయంగా ఉండటం ప్రజలను అసంతృప్తికి గురిచేస్తుంది. ప్రభుత్వ అధికారులకు ఎక్స్‌గ్రేషియా, డెత్ సర్టిఫికెట్‌లు ఇవ్వమని అడిగితే, వారు నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారు" అని హరీశ్‌రావు తెలిపారు. అలాగే, "ఏపీ, బీహార్, జారండ్, యూపీ నుంచి వచ్చిన బాధిత కుటుంబాలకు వసతి ఖర్చు 20,000 నుండి 30,000 రూపాయలు పడుతోంది. సీఎం కోటి రూపాయల పరిహారం ఇచ్చే ప్రసంగం మిగిలింది, కానీ ఎవరూ స్పష్టంగా ఏమి చేయలేకపోతున్నారు" అని ఆయన విమర్శించారు. "జగన్మోహన్ కొడుకు యశ్వంత్ ఫిర్యాదులో, సిగాచీ కంపెనీలో పాత మిషన్ వల్ల ప్రమాదం సంభవించిన విషయాన్ని అనేకసార్లు కార్మికులు పేర్కొన్నా, కంపెనీ పట్టించుకోలేదని స్పష్టంగా ఉంది. ఆ యాజమాన్యా న్ని ఎందుకు కాపాడుకుంటున్నారు?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. "ఈ ఘటనపై విచారణ జరిపి, బాధిత కుటుంబాలకు తక్షణం పరిహారం ఇవ్వాలని, కంపెనీకి చెందిన పరిహారం ప్రకటనను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. 15 రోజుల్లో పరిహారం ఇవ్వడానికి కంపెనీ ప్రకటన ఇచ్చింది, కానీ ఇప్పటివరకు దానిపై ఏమైనా చర్యలు తీసుకోలేదు" అని ఆయన చెప్పారు.

## విలువల రాజకీయాలకు ఆద్యుడు జైపాల్ రెడ్డి

- తెలంగాణ సాధనలో ఆయన పాత్ర అసామాన్యం
- వర్ధంతి సందర్భంగా మంత్రి పొన్నంప్రభాకర్ నివాళి
- నివాళి అర్పించిన మంత్రులు, పలువురు నేతలు



**హైదరాబాద్, జులై 28 :** తెలంగాణ ముద్దుబిడ్డ, విలువల విఖ్యాతకుడు ఎస్ జైపాల్ రెడ్డి అని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం నెక్లెస్ రోడ్ స్మృతి స్థలంలో ఎస్ జైపాల్ రెడ్డి ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన మెమోరియల్ వద్ద పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జైపాల్ రెడ్డి పాత్ర ఎనలేనిదని అలాగే అభివృద్దే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా గణనీయమైన సేవలందించారని, ముఖ్యంగా యువతరానికి ఆయన ఆదర్శమని అన్నారు. విద్యార్థిదశ నుండి ఒక లీడర్‌గా, కేంద్ర మంత్రిగా అందించిన మహనీయ సేవలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అజాతశత్రువు కీర్తిశేషులు ఎస్ జైపాల్ రెడ్డి అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. స్మృతి స్థల్ లో పుష్ప గుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర మంత్రి, ఎంపీ, రాజ్యసభ సభ్యులుగా ఎన్నో సేవలు అందించారని హైదరాబాద్ మెట్రో, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కి ఎంతో కృషి చేశారని అలాగే కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణలో వివిధ అభివృద్ధి పనులకు పదివేల కోట్ల రూపాయలు అలాగే నల్గొండ జిల్లాకు 400 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని అన్నారు. విశిష్ట సేవలు అందించిన వ్యక్తిగా జైపాల్ రెడ్డి ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారతరత్న అందించాలని అన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ జైపాల్ రెడ్డి ప్రజా సేవకు నిలువెత్తు సాక్ష్యం అని, తెలంగాణ రాష్ట్ర అవతరణలో ఆయన పాత్ర కీలకమని అన్నారు. స్టూడెంట్ లీడర్ గా, కేంద్ర మంత్రిగా అటు దేశానికి ఇటు తెలంగాణకు ఎన్నో విలువైన సేవలు అందించారని విలువలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చే వారని, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకోవటం ఆయన గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. రాజకీయాల్లో మచ్చలేని మనిషిగా ఎదిగారని నేటి తరం ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. స్వర్గీయ జైపాల్ రెడ్డి కుటుంబాన్ని శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మన్, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పరామర్శించారు. స్మృతి స్థల్ లో మాజీ కేంద్రమంత్రి కీర్తిశేషులు ఎస్ జైపాల్ రెడ్డి ఘాట్ నందు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, మాజీ మంత్రులు సంబాని చంద్రశేఖర్, మాజీ ఎంపీలు హనుమంతరావు, రవీంద్ర నాయక్, మధుయాష్కీ గౌడ్ ఎమ్మార్పీ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, స్వర్గీయ జయపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, పుర ప్రముఖులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వర్ధంతి సందర్భంగా ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. జైపాల్ రెడ్డి మెమోరియల్ వద్ద శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, ఇతర ప్రముఖులు నివాళులు అర్పించారు. జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను నేతలు పరామర్శించారు.

## ఈనెల 31 నుంచి రాష్ట్రంలో మీనాక్షి పాదయాత్రలు

- కార్యకర్తలతో కలిసి సమావేశాలు
- ఆగస్టు 6 వరకు పర్యటనలు

**హైదరాబాద్, జులై 28 :** తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తన నియోజకవర్గ పర్యటనలో భాగంగా పాదయాత్రలను ప్రారంభించబోతున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు వివిధ నియోజకవర్గాల్లో పాదయాత్రలు, శ్రమదానం కార్యక్రమాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు– పార్టీ వర్గాలు వెల్లడించాయి. పాదయాత్రల షెడ్యూల్ ప్రకారం, జూలై 31న పరిగి పట్టణంలో సాయంత్రం పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ పాదయాత్ర అనంతరం పరిగిలో రాత్రి బస చేయనున్నారు. ఆగస్టు 1న ఉదయం శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం ఆందోల్ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తారు.ఆగస్టు 2న శ్రమదానం కార్యక్రమంతో పాటు కార్యకర్తల సమావేశం ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు ఆర్మూరులో పాదయాత్ర చేపడతారు. ఆగస్టు 3న ఉదయం శ్రమదానం నిర్వహించి, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఖానాపూర్ లో పాదయాత్ర ఉంటుంది.ఆగస్టు 4న ఉదయం శ్రమదానం అనంతరం కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం చొప్పదండిలో పాదయాత్ర చేసి రాత్రి బస చేస్తారు. ఆగస్టు 5న ఉదయం శ్రమదానం అనంతరం సమావేశం నిర్వహించి, సాయంత్రం వర్ధన్నపేటలో పాదయాత్ర చేపడతారు. చివరిగా ఆగస్టు 6న శ్రమదానం, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పాదయాత్రలను ముగిస్తారు.



## గద్వాల పత్తి రైతులకు 700 కోట్ల బకాయిలు

- వెంటనే చెల్లించాలని విత్తన కంపెనీలకు ఆదేశం
- నెలలుగా బకాయిల చెల్లింపులో ఆలస్యంపై ఆగ్రహం
- మంత్రి జూపల్లితో కలసి సచివాయంలో మంత్రి తుమ్మల సమీక్ష

**హైదరాబాద్, జులై 28 :** జోగులంబ గద్వాల జిల్లా పత్తి రైతులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను నెలలోగా చెల్లించాలని సీడ్స్ కంపెనీలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. అన్ని కంపెనీలు కలిపి సుమారు రూ.700 కోట్లు రైతులకు బకాయిలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతులు, వారిపై ఆధారపడిన రైతుకూలీలు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వారికి చెల్లించాలని బకాయిలను వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గద్వాల జిల్లా రైతులు సుమారు 50వేల ఎకరాల్లో పత్తి విత్తనాలను సాగు చేశారని, నెలల గడిచినా ఇప్పటి వరకు వారికి సంబంధిత కంపెనీలు చెల్లింపులు చేయలేదని స్థానిక ఎంఎల్ఏ కృష్ణమోహన్‌రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు.గద్వాల జిల్లా రైతాంగం పత్తి విత్తనాల ఉత్పత్తిలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, దేశానికి తలమానికమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. విత్తన ఉత్పత్తి చేసి కంపెనీలకు అందిస్తే ఆయా కంపెనీలు రైతులకు ఇప్పటి వరకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించకపోవడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా ఆయా కంపెనీలు తక్షణమే స్పందించి నెలరోజుల్లోగా ఉన్న బకాయిలను రైతులకు చెల్లించి వారిని ఆదుకోవాలని కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా లాంటి కార్యక్రమాలతో రాష్ట్ర రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. వేల కోట్ల రూపాయలు రైతులకు ఇచ్చి ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకుంటు–oదన్నారు. రైతులకు లాభం, సౌకర్యం, సంక్షేమం మా ప్రాధాన్యమని మంత్రి అన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎంఎల్ఏ కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తన అభివృద్ధి స్థంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు గోపిలు పలు సీడ్ కంపెనీ ప్రతినిధులతో సచివాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో రాష్ట్ర సీడ్స్ మెన్ అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణ, ప్రవీణ్, వివిధ కంపెనీల ప్రతినిధులు, రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## కేసీఆర్ హయాంలో ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం


**గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్క**



**హైదరాబాద్, జూలై 28 :** గిరిజన సంక్షేమం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిందని ధ్వజమెత్తారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలకు రోడ్లు, బ్రిడ్జిలు అవసరమని.. కానీ గతంలో నిధులు పక్కదారి పట్టించడంతో గర్భిణుల ప్రసవవేదన వంటి వార్తలు వస్తున్నాయని చెప్పు కొచ్చారు. హైదరాబాద్‌లో ఇవా(సోమవారం) మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. ఏ ప్రభుత్వమైనా నిధులను పక్కదారి పట్టించవద్దని మంత్రి సీతక్క సూచించారు. ఎస్టీలకు కేటాయించిన నిధులను వారికే ఖర్చు చేయాలని కోరారు. కేటాయించిన నిధులను అదే అసెంబ్లీ నియోజకవర్గంలో, అదే జిల్లాలో సర్దుబాటు– చేయాలి.. తప్ప మైదాన ప్రాంతాలకు తరలించవద్దని ఆకాంక్షించారు. సబ్ ఎ÷–లాన్ నిధులను పక్కదారి పట్టిస్తే ఏజెన్సీ ఏరియా వెనకబాటులోనే మగ్గిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు.అందుకే ఎస్టీలకు కేటాయించిన ప్రతి పైసా వారికి ఖర్చు చేయాలని సూచించారు. ఎస్టీల్లో ఎక్కువమందికి ఉండటానికి ఇండ్లు లేవని తెలిపారు. కాబట్టి ఎస్టీల ఇండ్ల నిర్మాణం కోసం బడ్జెట్ నిధులను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. ఎస్టీలకు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కనీస స్థల అర్హతను సడలించాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## స్వప్రయతోజనాలకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

- సిట్ ముందుకు హాజరైన ప్రవీణ్ కుమార్
- బిఆర్ఎస్‌పై ఆరోపణల్లో యూటర్న్



**హైదరాబాద్, జూలై 28 :** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మాజీ ఐపిఎస్, బిఆర్ఎస్ నేత యూటర్న్ తీసుకున్నారు. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్‌పై ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌ను బీఆర్ఎస్ రాజకీయంగా వాడుకోలేదని ఇప్పుడు మాట మార్చారు. బీఆర్ఎస్‌కి అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇచ్చారు. అప్పటి ఫిర్యాదుపై వాంగ్మూలం ఇవ్వమంటే , సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, తన ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నట్లు– సిట్‌కి ఫిర్యాదు చేశారు. డార్క్ వెబ్‌సైట్‌లో టూల్స్ ఉపయోగించి ప్రైవేటు– వ్యక్తులతో ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నట్లు– ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్‌ను పావుగా వాడుకుంటోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రవీణ్ కుమార్ విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో (చారణకు మాజీ పోలీస్ ఉన్నతాధికారి, బీఆర్ఎస్ కీలక నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సోమవారం హాజరయ్యారు. విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని ప్రవీణ్ కుమార్‌కి సిట్ అధికారులు రెండు సార్లు నోటీ–సులు ఇచ్చిన విషయం తెలిసిందే. తన ఫోన్ బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాక్ చేస్తోందని, ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడుతోందని గతంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు హోదాలో ప్రవీణ్ కుమార్ ఈసీ, డీజీపీకి ఫిర్యాదు చేశారు. ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు ఆధారంగానే సిట్ అధికారులు విచారణకు పిలిపించారు. ప్రవీణ్ కుమార్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు సిట్ అధికారులు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రవీణ్ కుమార్ ఫోన్ ట్యాప్ అయినట్లు– సిట్ అధికారులు గుర్తించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రవీణ్ కుమార్ స్టేట్‌మెంట్ ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా లేదా అనుకూలంగా ప్రవీణ్ కుమార్ వాంగ్మూలం ఇచ్చాడా అనేది చర్చనీయాంశంగా మారింది.ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రవీణ్ కుమార్ యూటర్న్ తీసుకున్నారు. గతంలో బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్ చేస్తోందని, కేసీఆర్ తన ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ప్రవీణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై పంజాగుట్టలో ఎఫ్ఐఆర్ నమోదైంది. పంజాగుట్టలో నమోదైన ఎఫ్ఐఆర్‌పై ప్రవీణ్ కుమార్ నుంచి వాంగ్మూలం తీసుకున్నారు సిట్ అధికారులు. యాపిల్ మొబైల్‌కి అలర్ట్ మెసేజ్ రావడంతో గతంలో ఫిర్యాదు చేశానని ప్రవీణ్ కుమార్ తెలిపారు.



# పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అపహాస్యం

వారం రోజులుగా పార్లమెంటులో ప్రతిష్ఠంభన కొనసాగుతూనే ఉంది. సమస్యలపై చర్చించాలన్న ఆసక్తి అధికార విపక్షాలకు లేకుండా పోయింది. సభ ప్రారంభం కాగానే గోడవ చేయడం విపక్షాల వంతు అయితే వాయిదా వేయడం స్పీకర్ విధిగా మారింది. సోమవారం ఉద్యం కూడా ఇదే తరహాలో మధ్యాహ్ననికి సభ వాయిదా పడింది. దీనిబదులు సమస్యలు ముందుకు వేసుకుని ఏరోజు ఏది చర్చించాలన్నది నిర్ణయం తీసుకోవచ్చు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ రూపాల్లో చర్చించేందుకు ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలి. కానీ ప్రతిష్టంభనతో సాధించేదేమి లేదని ఇరు పక్షాలు కూడా గుర్తించాలి. ఇప్పుడు వర్షాకాల సమావేశాలు సైతం ఒక్కటంటే ఒక్క సమస్యపై చర్చించడం లేదు. ఈనెల 21న పార్లమెంట్ సమావేశాలు మొదలయ్యాయి. నేటికీ ఒక్క సమస్యపైనా చర్చలేదు. చర్చకు సిద్దమని అధికార పక్షం చెబుతున్నా.. విపక్షాలకు మాత్రం అవకాశం ఇవ్వడం లేదు. భారతదేశం, ప్రజాస్వామ్యం గురించి గొప్పలు చెప్పడం మనకు బాగా అలవాటయ్యింది. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పార్లమెంట్ అధికారంలో ఉన్న ఒకరిద్దరు నేతల కనుసన్నల్లో సాగుతున్నాయి. ఎందుకిలా అన్న ఆలోచన కూడా చేయడం లేదు. ఇదేదో అధికార,విపక్షాల సమస్యగా చూస్తున్నారు. ఇక్కడ 140కోట్ల ప్రజలంతా ఆందోళనలతో ఉన్నా పట్టించుకోవం లేదు. వరదలతో దేశం మునుగుతున్నా చర్చించడం లేదు. భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మేడిపండు చందంగా మారిందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. వ్యక్తిస్వామ్యం, నిరంకుశత్వం ప్రబలిపోతోంది. పార్లమెంట్, అసెంబ్లీల్లో ప్రజల సమస్యల పై చర్చ జరగడం లేదు. అధికార విపక్షాలు కలసి ఇదేదో తమ సొంత జాగీరుగా భావించి.. సమావేశాలను నడుపుకుంటున్నారు.

అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఇదే తంతు సాగుతోంది. బిజెపి అధికారం చేపట్టిన తరవాత అసలు సమస్యలపై చర్చ అన్నది మరచిపోయారు. సమస్య ఏదైనా పార్లమెంటులో చర్చకు రావడం లేదు. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీల్లో ఇదే పద్దతి సాగు తోంది. రాష్ట్రాల్లో కూడా అధికార పార్టీ నేతలు చర్చలకు అవకాశం ఇవ్వడం లేదు. ఇకపోతే చట్టసభల్లో చర్చించకుండానే చట్టాలు వస్తున్నాయి. చట్టసభల్లోచర్చించకుండా సమస్యలను దాట వేస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నామన్న ఆలోచనచేయడం లేదు. రాబోయే తరాలకు ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారో చెప్పడం లేదు. అధికార, విపక్షాలు తమ రాజకీయ ఎజెండాతో పనిచేయడం వల్లనే ఇలా జరుగుతోంది. ఇలా ఒక్క సమస్యపైనా చర్చించకుండా కాలం గడిపేస్తున్నారు. దేశంలో పెరుగుతున్న ధరలు, జీఎస్టీ పెంపు, వరదలు, నిరుద్యోగం లాంటి అంశాలపై చర్చించి జవాబివ్వా లని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతిపక్షాలు ప్రవేశ పెడుతున్న వాయిదా తీర్మానాలను సభాపతులు బుట్టదాఖలు చేస్తున్నారు. కనీసం సభావ్యవహారాల కమిటీ సమావేశాల్లో కూడా కీలక అంశాలపై చర్చకు సమయాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం మనస్ఫూర్తిగా ముందుకు రావడం లేదు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పు డల్లా ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశంపై చర్చించడానికి తాము సిద్ధమని ప్రధాని మోడీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించడం ఆనవాయితీగా మారింది. తొలిరోజు ప్రధాని మోడీ కూడా సభ సజావుగా సాగాలని, ఈ సమావేశాలకు ప్రాధాన్యం ఉందని అంటున్నారు. అయితే పార్లమెంట్ సమావేశమైన తర్వాత అలాంటి సుహృద్భావ వాతావరణం మాత్రం కనపడడం లేదు. నిజంగా ఎందుకు ఇలా చేస్తున్నారో బిజెపి అగ్రనేతలు చెప్పాలి. ఎందరో కొత్త సభ్యులు పార్లమెంట్ గడప తొక్కారు. వారికి రూల్స్ కూడా తెలియకుండానే సమావేశాలు వాయిదా పడుతున్నాయి. ఈ తరహా జరుగుతున్న సమావేశాలతో ప్రజలకు ఏం సమాధానం చెబుతారో చెప్పాలి. పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడల్లా అసలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎక్కడుందన్న అనుమానం కలుగుతుంది.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై వారం రోజులైనప్పటికీ ఒక్కరోజు కూడా పార్లమెంట్ సరిగ్గా సాగలేదు. వాయిదా తీర్మానాలతో విపక్షాలు ఆందోళన చేస్తున్నారు. స్పీకర్లు వాయిదాలు వేస్తున్నాయి. తాజాగా పార్లమెంట్ వ్యవహారాల పరిస్థితి ఇది. పార్లమెంట్‌ను నడిపించేందుకు రాజనీతిజ్ఞత అవసరం. మనం ఉన్నదే ప్రజల కోసం అన్న కోణంలో అధికార పక్షం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండి..సమస్యలపై చర్చించడం ద్వారా ప్రజలకు సందేశం ఇవ్వాలి. ఇలా నిరంకుశంగా వెళితే ఎంతటి వారికైనా ప్రజలు శిక్ష వేయక మానరు. మళ్లీ మాదే అధికారం అన్న అహంకార ధోరణి పనికిరాదు. పదేళ్లపాటు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ అదేరీతిలో ప్రవర్తించి ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయింది. బిజెపి కూడా ఇదే ధోరణితో సాగితే ప్రజలు కూడా చాపచుట్టినట్లు చుట్టి బంగాళాఖాతంలో విసరేస్తారని గుర్తించాలి. చట్టసభల్లో ప్రజా సమస్యలను చర్చించేందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వాలి. వారు సమస్యలను ప్రస్తావిస్తే చర్చించాలి. చర్చల ద్వారా ప్రజల మనోగతాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే చట్టసభలకు విలువ ఉంటుంది. గతంలో ఎప్పుడూ చర్చలకు ప్రాధాన్యం ఉండేది. సమస్యలపై తక్షణ చర్చలు చేపట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. చట్టసభలకు గౌరవం ఇనుమడించేలా అధికార విపక్షాలు కలిసి పనిచేయాలి. చట్టసభలను పాలకులే ఎక్కువగా గౌరవించాలి. ప్రజల సమస్యలపై చర్చించడం అలవాటు చేసుకోవాలి. ప్రజల సమస్యలపై చర్చించిన తరవాతనే విధాన నిర్ణయాలు తీసు కోవాలి. లేకుంటే ప్రజలు ఓ కంట కనిపెడుతుంటారని గుర్తించాలి. పార్లమెంటులో మంచి సంప్రదాయం నెలకొల్పేందుకు బిజెపి నేతలు ముందుకు రాకుంటే వారికి కూడా చరిత్రగుణ పాఠం చెప్పడం ఖాయం.

# జమ్మూకశ్మీర్‌లో 'ఆపరేషన్‌మహదేవ్'

## ముగ్గురు పహల్గాం ఉగ్రవాదుల హాతం



**శ్రీనగర్, జూలై 28 :** జమ్మూకశ్మీర్‌లో నేడు జరిగిన 'ఆపరేషన్ మహాదేవ్'లో 'పహల్గాం దాడి'తో సంబంధం ఉన్న ముగ్గురు ఉగ్రవాదులను సైనిక దళాలు మట్టుబెట్టాయి. ఈ విషయాన్ని సైన్యం ధ్రువీకరించినట్లు ఆల్-ఇండియా రేడియో వెబ్‌సైట్‌లో వెల్లడించింది. హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాల సమాచారంతో నెల రోజుల నుంచి గాలింపు చేపట్టారు. ఈ ఆపరేషన్ కోసం గత కొన్ని రోజులుగా దళాలు పకడ్బందీగా ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దాచిగామ్ అడవుల్లో రెండ్రోజుల క్రితం అనుమానాస్పద కమ్యునికేషన్లను భద్రతా దళాలు పసిగట్టాయి. దీనికి తోడు.. స్థానిక సంచార జాతుల వారు కూడా ఉగ్రవాదుల కదలిలపై భద్రతా దళాలకు సమాచారం అందించారు. ఈ క్రమంలో గాలింపు చేపట్టిన భద్రతా దళాలకు లిడ్వాస్ ప్రాంతంలో తొలిసారి ఉగ్రవాదులు భద్రతా దళాలకు మధ్య కాల్పులు జరిగాయి.

### ఆపరేషన్‌కు ఈ పేరు ఎందుకు..?

దాచిగామ్ సమీంలోని మహాదేవ్ పర్వతం ఆధారంగా ఈ ఆపరేషన్‌కు పేరు పెట్టారు. ఎన్‌కౌంటర్ జరుగుతున్న ప్రదేశం జబర్వన్-మహదేవ్ పర్వతాల మధ్య జరుగుతోంది. అందుకే ఈ పేరు పెట్టారు. ఈ ఆపరేషన్‌ను జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా చేపట్టాయి. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది. మృతిచెందిన ముగ్గురూ విదేశీ ఉగ్రవాదులే.. వీరు లష్కరే తయిబాకు చెందినవారు. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ చేపట్టారు. ఘటనాస్థలంలో ఏకే-47 రైఫిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న భద్రతా దళాలను నార్తర్న్ కమాండ్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ అభినందించారు. దళాలు వేగంగా స్పందించి చర్యలు తీసుకొన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గల ప్రముఖ పర్యాటక ప్రాంత మైన బైసరన్ లోయ వద్ద ఉగ్రవాదులు మారణహెూ మానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అతి సమీపం నుంచి కాల్పులు జరిపి 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ వ్యక్తి ప్రాణాలు తీశారు. అనంతరం అక్కడినుంచి పరారయ్యారు. అప్పటినుంచి భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నాయి. లష్కరే తయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. వీరిలో ఒక్కొక్కరి తలపై రూ.20లక్షల వరకు రివార్డును ఇప్పటికే ప్రకటించారు.

# ఆపరేషన్ సిందూర్

## 100కి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టాం : రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ :** పహల్గాంలో ఉగ్రదాడి హేయమైన చర్య అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మతం పేరు అడిగి మరీ పర్యాటకులను కాల్చి చంపారన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు భారత సైనికులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారని, పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాడులు జరిపారని అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌ను వణికించిన 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో వాడీవేడి చర్చ మొదలైంది. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో వంద మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టామన్నారు. "మే 7 రాత్రి భారత బలగాలు తమ శక్తి, సామర్థ్యాలు చాటిచెప్పాయి. పీవోకే, పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపారు. మన సైనికులు ఏడు ఉగ్ర శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేశారు. సిందూర్ అనేది వీరత్వానికి, శౌర్యానికి ప్రతీక. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సైన్యానికి అభినందనలు. దేశ ప్రజలను రక్షించడం మా ప్రభుత్వ బాధ్యత. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ సైన్యం మనపై దాడికి దిగింది. దాయాది దాడులను సమర్థంగా తిప్పికొట్టాం. మన సైనికులు మిసైళ్లతో విరుచుకుపడ్డారు. పాకిస్థాన్‌లోని మిసైల్ లాంఛింగ్ స్టేషన్ ధ్వంసమైంది. శత్రువుల దాడులను భారత రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది. మన వాయుసేన పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసింది. ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా సైనికులు దాడులు జరిపారు. ఉగ్ర శిబిరాల్లోకి చొచ్చుకెళ్లి మరీ ఉగ్రవాదులను హతమార్చాం. భారత దాడులను అనేక దేశాలు సమర్థించాయి. సరిహద్దులు దాటి వెళ్లడం.. ఆపరేషన్ సిందూర్ లక్ష్యం కాదు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే సంస్థలను ధ్వంసం చేయడమే మా లక్ష్యం. యుద్ధం మా లక్ష్యం కాదు.. ఉగ్రవాదులకు బుద్ధి చెప్పడమే మా విధానం.

### కాళ్ల బేరానికి వచ్చిన పాక్

మనం చేసిన దాడులతో పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. మన త్రివిధ దళాలను తట్టుకోలేక పాక్ డీజీఎంవో వెంటనే మనకు ఫోన్ చేశారు. మాతృభూమి రక్షణలో మన సైనికుల వీరత్వం కనిపిస్తోంది. భుజ్, ఉధంపూర్ స్థావరాలకు వెళ్లి మన సైనికుల సత్తా ప్రత్యక్షంగా చూశా. సైనిక సత్తాను ప్రశ్నించడం విపక్షాలకు సరికాదు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని గట్టిగా చెబుతున్నాం. ఇలాంటి ఆపరేషన్లు జరిగినప్పుడు చిన్న చిన్న విషయాలు పట్టించుకోకూడదు. 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా.. ఇలాంటి ప్రశ్నలు ఎప్పుడూ వినలేదు. ఇలాంటి విషయాల్లో ఆచితూచి, ఆలోచించి ప్రశ్నలు అడగాలి.

### స్నేహ హస్తం.. భారత్ గొప్పతనం

1962లో చైనాతో యుద్ధం జరిగినప్పుడు విపక్షాలు ఎలాంటి ప్రశ్నలు వేశాయో తెలుసుకోవాలి. ఆనాడు విపక్షాలు భారత భూభాగం, మన సైనికుల పరిస్థితి గురించి ప్రశ్నించాయి. మన సైనికుల చర్యను వాజ్‌పేయి ప్రశంసించారు. 1999లో శాంతి యుత పరిస్థితిని కోరుతూ వాజ్‌పేయి లాహోర్ యాత్ర చేపట్టారు. పాకిస్థాన్‌తో భారత్ స్నేహం కోరుకుంటోందని ఆనాడు వాజ్‌పేయి చెప్పారు. స్నేహ హస్తం చాచడమే భారత్ గొప్పతనం. ఆనాడు వాజ్‌పేయి తీవ్ర నిర్ణయం తీసుకుంటే పాక్ మర్నాడు సూర్యోదయం చూసేది కాదు. శాంతి కోరడం భారత్ రక్తంలోనే ఉంది. యుద్ధాలు కోరుకోం. ప్రతి విషయాన్ని మానవత్వ కోణంలో ఆలోచిస్తాం. తుపాకులు పేలితే ఎవరూ మిగలరు.

### చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి

ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ అధికారులు పాల్గొన్నారు. దీనిని బట్టి వారిని ఆ దేశం ఎలా పెంచి పోషిస్తుందో స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటివరకు మనం ఎవరిపైనా దాడి చేయలేదు. పాకిస్థాన్ చరిత్ర, అక్కడి ఉగ్రవాదం గురించి తెలుసుకొని మాట్లాడాలి. మనిషి.. నీతి, నిజాయతీతో బతకాలని తులసీదాస్ దోహాలో చెప్పారు. భారత స్నేహహస్తాన్ని పాక్ అందుకోలేకపోయింది. మనదేశ ప్రజలను చంపుతుంటే సైన్యం చూస్తూ ఊరుకోదు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం.. ఆ దేశానికే ఇబ్బందిగా మారుతుంది" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

# పాక్ పన్నాగాలను సాగనివ్వకూడదు : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** పాక్ కుట్రలను సాగనివ్వకూడదని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై అనేక సందేహాలు ఉన్నాయని అయితే ప్రభుత్వం వీటికి సమాధానం చెప్పాలని కోరారు. ఆపరేషన్ సిందూర్‌పై రాజ్‌నాథ్ అనేక విషయాలు చెప్పారన్న ఆయన.. పహల్గాంకు ఉగ్రవాదులు ఎలా రాగలిగారో చెప్పలేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా గౌరవ్ గొగోయ్ మాట్లాడారు. "పహల్గాంకు ఉగ్రవాదులు వచ్చి ఎలా దాడి చేయగలిగారో రాజ్‌నాథ్ చెప్పలేదు. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు మేం తప్పకుండా కొన్ని ప్రశ్నలు అడుగుతాం. ప్రభుత్వం వాటికి కచ్చితంగా సమాధానం చెప్పాలి. భారతీయులు ఏకతాటిపై ఉండి పాకిస్థాన్ దురుద్దేశాలను సాగనివ్వకూడదు. ఉగ్రవాదులు పారిపోయేలా మనం చేశామా? లేదా? అన్నది చెప్పాలి. ఉగ్రదాడిలో చనిపోయిన వ్యక్తి భార్య తన ఆవేదన వెళ్లగక్కారు. తన భర్త మృతదేహంపై రాజకీయాలు కోరుకోవట్లేదని ఆమె చెప్పారు. మన సమాజం విభేదాలతో విచ్ఛిన్నం కావాలని పాక్ కోరుకుంటోంది. ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని రాహుల్ గాంధీ కూడా చెప్పారు. పాకిస్థాన్‌కు మాత్రం భారత్ తరఫున గట్టిగా బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోయి 100 రోజులు గడిచింది. ఇప్పటివరకు దాడికి కారకులను ప్రభుత్వం పట్టుకోలేకపోయింది. మారణకాండకు పాల్పడిన తర్వాత ఉగ్రవాదులు కొందరి సహకారంతో పరారయ్యారు. ఉగ్రవాదులకు మద్దతిచ్చిన వారి గురించి సర్కారు వద్ద జవాబు లేదు. శాటిలైట్ వ్యవస్థ, పోలీసు వ్యవస్థ ఇంత ఉన్నా ఉగ్రవాదులను పట్టుకోలేకపోయారు. ఆర్టికల్ 370 ఎత్తివేసిన తర్వాత జమ్ముకశ్మీర్ సురక్షితంగా మారిందన్నారు. ప్రభుత్వ హామీతో జమ్ముకశ్మీర్‌కు పర్యాటకుల తాకిడి మొదలైంది. అంతలోగా ఈ దారుణం చోటు చేసుకోవడం దురదృష్టకరం. " అని గొగోయ్ అన్నారు.



## షటిల్ ఆడుతూ గుండెపోటుతో యువకుడు మృతి

**హైదరాబాద్, జూలై 28 :** షటిల్ ఆడుతుండగా నాగోల్ లో గుండెపోటుతో యువకుడు మృతి చెందాడు. ఖమ్మం జిల్లాలో తల్లాడకు చెందిన గుండ్ల రాకేష్ (25) హైదరాబాద్ లో ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తూ నాగోల్ నివసిస్తున్నాడు. నాగోల్ లోని ఇండోర్ స్టేడియంలో రాకేష్ షటిల్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. రాకేష్ ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయాడని వెల్లడించారు. గుండెపోటుతోనే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

## విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం టెండర్లు

**అమరావతి, జూలై 28 :** విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ఏపీ మెట్రోరైలు కార్పొరేషన్ టెండర్లు పిలిచింది. ఈపీసీ విధానంలో ఈ టెండర్లను ఆహ్వానించింది. ఫేజ్-1లో 38.4 కి.మీ మేర రెండు కారిడార్లలో విజయవాడ మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. కారిడార్-1లో నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం బస్టాండ్ వరకు.. కారిడార్-2లో బస్‌స్టేషన్ నుంచి పెనమలూరు వరకు మెట్రో నిర్మాణం జరగనుంది. కారిడార్-1లో 4.7 కి.మీ మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టనున్నారు. 32 చోట్ల మెట్రో స్టేషన్లు, ఒక చోట అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ రానుంది. ఇప్పటికే విశాఖ మెట్రో రైలు టెండర్లను పిలిచిన విషయం తెలిసిందే.

## బాటసింగారం వద్ద భారీగా గంజాయి పట్టివేత

**రంగారెడ్డి, జూలై 28 :** రంగారెడ్డి జిల్లా బాటసింగారం వద్ద భారీగా గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఖమ్మం ఈగల్ టీ-మ్, రాచకొండ పోలీసులు తనిఖీలు చేపట్టి.. 935 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు- చెప్పారు. ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని 455 ప్యాకెట్లుగా చేసి పండ్ల ట్రేలల్లో ఉంచి డీసీఎంలో తరలిస్తున్నట్లు- వెల్లడించారు. ముగ్గురు అంతర్‌రాష్ట్ర నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు.



## ఏ గుర్తింపు కార్డునైనా ఫోర్జరీ చేస్తారు కదా?

### ఈసీకి సుప్రీం ప్రశ్న

**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. ఆమోద యోగ్యమైన గుర్తింపు పత్రాల జాబితా నుంచి ఆధార్‌ను మినహాయించాలనే అంశంపై వివాదం కొనసాతున్న విషయం తెలిసిందే. వెరిఫికేషన్ కోసం పరిశీలించాలనుకుంటున్న 11 పత్రాల్లో ఆధార్, ఓటర్ ఐడీ కార్డులను చేర్చకపోవడంపై పలువురు సుప్రీంను ఆశ్రయించారు. బిహార్ ఓటర్ల జాబితా 'ప్రత్యేక ముమ్మర సవరణ' (ఎస్‌ఐఆర్)పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఆధార్‌ను గుర్తింపుకార్డుగా పరిగణించకపోవడంపై ఎన్నికల కమిషన్ ప్రశ్నించింది. ఆధార్‌ను ఓటరు జాబితా గుర్తింపు కోసం ఎందుకు పరిగణించడం లేదని.. ఏ గుర్తింపు కార్డునైనా ఫోర్జరీ చేస్తారు కదా? అని వ్యాఖ్యానించింది. ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఎన్నికల సంఘం జారీ చేసిన ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సూచించింది. ఒకవేళ వాటిని పరిగణనలోకి తీసుకోకపోతే అందుకు గల కారణాలను తెలియజేయాలని స్పష్టం చేసింది.



ప్రజావాణి ఫిర్యాదులను

## సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లాలో ప్రజా ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 119 ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ భూ సమస్యలు, భూ సర్వే, పెన్షన్ లకు సంబంధించి ఫిర్యాదు లు సమర్పించారు. ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదు దారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ డి ఓ వాసు చంద్ర, డిఆర్డిఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలు

## ప్రతి పేదవాడికి చేరాలి

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

**షాబాద్, రాజముద్ర న్యూస్ :** సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరాలనదే ప్రభుత్వ ధ్యేయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. సోమవారం రోజు ప్రజా పాలన లో భాగంగా షాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రతి పేదవాడికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రతి అర్హునికి కార్డు మంజూరు చేసి, సన్న బియ్యం ద్వారా వారి కడుపు నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అనంతరం షాబాద్ మండలానికి చెందిన లబ్ధిదారులకు మజూరైన రూ.4,03,000 విలువ గల 10 ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సిపిఐ జిల్లా 17వ మహాసభను

## విజయవంతం చేయండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభులింగం**

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్ :** చేవెళ్ల మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ చేవెళ్ల మండల కౌన్సిల్ సమావేశం మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభు లింగం హాజరై మాట్లాడుతూ... ఆగస్టు రెండవ తేదీన మొయినాబాద్ మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్లో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ 17వ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభ 400 మంది డెలిగేషన్ తో జరుగుతుందని, ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభలో నూతన కౌన్సిల్ కార్యవర్గము నూతన కార్యదర్శిని ఎన్నుకోవడం జరుగుతుందని, అదేవిధంగా భవిష్యత్తులో పార్టీ నిర్మాణం ప్రజా సంఘాల నిర్మాణము పార్టీని బలోపేతం చేయడం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ దిశగా నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఐకెఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి సుభాన్ రెడ్డి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, షారీలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, మీనాక్షి, లలిత, పోచయ్య, ఒగ్గు సత్యనారాయణ, మల్లయ్య, పెంటయ్య పాల్గొన్నారు.



## ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ పాయింట్ల విధానాన్ని సవరించాలి

**మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేష్**

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్ :** ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ పాయింట్ల విధానాన్ని అమలు చేయడంతో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఆ విధానాన్ని సవరించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలెక్టరేట్‌లో కలిసి మాల మహానాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ...భారత అత్యున్నత న్యాయస్థానం సూచనలను పట్టించుకోకుండా 2011 జనాభా లెక్కల ప్రకారాన్ని అనుసరించి, ఎంపరికల్ డేటా సేకరించకుండా, జస్టిస్ షమీం అక్తర్ తప్పుడు నివేదిక ఆధారంగా ఎస్సీలను కులాలవారీగా వర్గీకరించారని అన్నారు. మాలలతో పాటు మరో 25 అనుబంధ కులాలను గ్రూప్ 3లో చేర్చి 5 శాతం రిజర్వేషన్ కల్పించడం దారుణమన్నారు. ఈ 5 శాతం కూడా విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ అందకుండా రోస్టర్ విధానాన్ని రూపొందించారన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో మాల మహానాడు షాద్‌నగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు సున్నపు నర్సింహ, విద్యార్థి విభాగం డివిజన్ నాయకుడు కె మల్లేష్, మాల మహానాడు ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడు శేఖర్, షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

శంకర్‌పల్లిలో లబ్ధిదారులకు

# రేషన్ కార్డులు పంపిణీ

**హాజరైన మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య**



**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందిస్తామని పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రోజు చెందిన 157 లబ్ధిదారులకు పట్టణంలోని మణి గార్డెన్ లో కొత్త రేషన్ కార్డులను, 26 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఆర్డీవో చంద్రకళతో కలిసి పంపిణీ చేసిన మహేందర్ రెడ్డి. పేదల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులను అందిస్తున్నారని మహేందర్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లాలో కొత్తగా ప్రస్తుతం 6,770 మందికి కొత్త రేషన్ కార్డులు అందిస్తుండగా, ముత్తంగా 16,582 మంది కొత్త కార్డులు అప్రూవల్ అయ్యాయన్నారు. అలాగే 78,000 మంది పేర్లు కార్డులలో అదనంగా పేర్లను నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలో 1562 మందికి కొత్త రేషన్ కార్డులు అప్రూవల్ అవ్వగా, ప్రస్తుతం 600 కార్డులు ఇస్తుండగా, అదనంగా 8,000 మంది అర్హుల పేర్లను రేషన్ కార్డులలో చేరుస్తున్నామని మహేందర్ రెడ్డి అన్నారు. రేషన్ కార్డులు ఉన్న ప్రతి అర్హత గల అందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తామన్నారు. రాష్ట్రంలో మహిళలకు వంట గ్యాస్ పంపిణీ, ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రైతులకు రైతు భరోసా, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని ఆయన అన్నారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.... నిరుపేదలకు అనేక పథకాలను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో 7వేల ఇందిరమ్మ ఇళ్లు మహిళలకు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇండ్లు మంజూరైన వారు 45 రోజుల్లో ఇంటి నిర్మాణం ప్రారంభించుకుంటే, అర్హులైన ఇతరులకు కేటాయిస్తామని, అవసరమైనన్ని ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులను

# సత్వరమే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



**మేడ్చల్, రాజముద్ర న్యూస్:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి లా ఆఫీసర్ చంద్రావతి తో కలిసి అదనపు కలెక్టరు (80) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని అన్నారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి అర్జీదారులకు ఎందుకు తిరస్కరిస్తున్నామనే విషయాన్ని తప్పనిసరిగా వివరంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంటనే నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

# జాగ్రత్త వహించాలి

**సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్**

- మల్కాజ్గిరి ఏరియా ఆసుపత్రిని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా తో కలిసి ఆకస్మిక తనిఖీ



**మేడ్చల్, రాజముద్ర న్యూస్ :** సీజనల్ వ్యాధుల నేపథ్యంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని 24 గంటలు ఆస్పత్రిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సెర్ప్ సిఈఓ దివ్యా దేవరాజన్ ఐఎఎస్ అన్నారు. సోమవారం మల్కాజిగిరి ఏరియా ఆసుపత్రిని సెర్ప్ సిఈఓ దివ్యా దేవరాజన్, జిల్లా అదనపు కలెక్టరు రాధిక గుప్తాతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా సిఈఓ మాట్లాడుతూ... నార్మల్ డెలివరీస్ ని ప్రోత్సహించాలని, ఓపి సేవలు పెంచాలని, టీబీ ముక్త భారత్ లో భాగంగా స్క్రీనింగ్, ఎక్స్ రే సేవలు అందించాలన్నారు. ఈడిడి కేసులను ఫాలోఅప్ చేయాలని, ఫీవర్ క్యాంప్స్ పెంచాలని, డెంగ్యు కేసులు నివారించాలని మెడికల్ ఆఫీసర్లకు సూచించారు. చిన్న పిల్లలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రులలోని జెరియాట్రిక్ వార్డు (వృద్ధుల చికిత్స విభాగం), జిల్లా కేన్సర్ సెంటర్, పిడియాట్రిక్ వార్డు (శిశువైద్య విభాగం), ఔట్ పేషెంట్ వార్డు తదితర విభాగాలను పరిశీలించారు. దివ్యాంగులకు అందుతున్న చికిత్సను సమీక్షించి, వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై వివరంగా విచారణ చేశారు. ఆపరేషన్ థియేటర్లను పరిశీలించి ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలు, శస్త్రచికిత్సల (ఆపరేషన్ల) సంఖ్యపై వైద్యుల వద్ద నుండి వివరాలు సేకరించారు. ఫార్మసీలో ఉన్న మందుల నిల్వలు, వాటి సరఫరా, ఈ-ఔషధి పోర్టల్ పనితీరు గురించి సమీక్షించారు. అలాగే అభ కార్డుల పంపిణీ, ల్యాబ్ సదుపాయాల కింద తీసుకున్న శాంపిళ్ల వివరాలు, క్షయవ్యాధి (టీబీ) రోగుల చికిత్సకు అందుబాటులో ఉన్న సదుపాయాలపై కూడా వివరంగా విచారణ చేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ ఉమాగౌరీ, సంబంధిత మెడికల్ అధికారులు పాల్గొన్నారు.



## టీసీఎస్‌లో 12వేల ఉద్యోగాల కోతపై కేంద్రం నజర్

**ఢిల్లీ:** దేశంలో ప్రఖ్యాత ఐటీ సేవల సంస్థ టీసీఎస్ భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమవుతున్నట్లు ఆ సంస్థ సీఈవో కె.కృతివాసన్ నిన్న ప్రకటించిన విషయం తెలిసిందే. దాదాపు 12 వేలకు పైగా ఉద్యోగాల కోత నిర్ణయంపై కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. మొత్తం పరిస్థితిని కేంద్రం నిశితంగా గమనిస్తోందని, టెక్ కంపెనీతో టచ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఉపాధిలో వృద్ధి కేంద్ర ప్రభుత్వ కీలక ప్రాధాన్యంగా ఉందని, ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం వంటి కార్యక్రమాలతో ఉద్యోగావకాశాలను ఎలా పెంచవచ్చనే అంశంపైనా దృష్టి సారించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అదే సమయంలో, నైపుణ్య శిక్షణ, పునఃనైపుణ్య శిక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులను ఐటీ మంత్రిత్వశాఖ గమనిస్తోం దని, టెక్ సంస్థ టీసీఎస్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను గుర్తించేందుకు లోతుగా అధ్యయనం చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 12,261 మంది ఉద్యోగులను అంతర్జాతీయంగా తొలగించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్ వెల్లడించారు.



పాత ప్రభుత్వాసుపత్రిని

## తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్


**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలో మరమ్మతుపనులను త్వరితగతిన పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వైద్య అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం పట్టణ కేంద్రంలోని పాత ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న వార్డ్స్‌ను, వాష్ రూమ్ లు అన్నింటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అవసరమైన విభాగాలను అన్నింటిని ఏర్పాటు చేసుకొని ప్రజలకు వైద్య సేవలను అందించే విధంగా ఆసుపత్రిని తీర్చిదిద్దుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రి బిల్డింగ్ కు వేస్తున్న పెయింటింగ్ ను పూర్తి చేసి ఆసుపత్రిలో మైనర్ మరమ్మత్తు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో పిఆర్ఇఇ ఉమేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి ఉన్నారు.



## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**మూసాపేట్ లోని యూపీహెచ్‌ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**




**మేడ్చల్, రాజముద్ర న్యూస్:** ప్రజలు స్వచ్ఛతపై దృష్టి సారించాలని, ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి మెరుగైన వైద్య సేవలు అందించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం కూకట్ పల్లి మండలం మూసాపేట్ లోని యూపీహెచ్ఎస్ సెంటర్ ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఉమా గౌరీతో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. రోజుకు ఎంతమంది ఓపి పేషెంట్లు వస్తారని వారి నమోదు ఏవిధంగా రిజిస్టర్ చేస్తున్నారని ఆన్లైన్లో పరిశీలించారు. ఏ ఎన్ సి, బిపి, షుగర్ పరీక్షలు పేషెంట్లు రెగ్యులర్ గా వస్తున్నారా అని సీజనల్ వ్యాధులపై ఇంటింటి ఫీవర్ సర్వే చేస్తున్నారా అని, డెంగ్యూ పరీక్షలు ఏ విధంగా చేస్తున్నారని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. పేషంట్ల ఓపి నమోదు రిజిష్టర్లను కలెక్టర్ పరిశీలించి రోజుకు ఎంత మంది ఓపి పేషంట్లు వస్తున్నారని అడిగారు. సరిపడా మెడిసిన్ అందుబాటులో ఉంటున్నాయా అని, మందులను పరిశీలించి ఎక్స్పైరీ డేట్ జాగ్రత్తగా చెక్ చేసుకోవాలని కలెక్టరు సూచించారు. టిబి, ల్యాప్రోసి పేషంట్లు ఎంత మంది ఉన్నారని, ఎన్ సిడి కేసులు ఎన్ని ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్ ను పరిశీలించిరోజుకు ఎన్ని టెస్టులు చేస్తున్నారని కలెక్టరు అడిగారు. యూపీహెచ్ఎస్ బోర్డు పేరు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా పెట్టాలని కలెక్టరు మెడికల్ ఆఫీసర్ కు సూచించారు.

## డబ్బుల వర్షం కురిపిస్తామంటూ టోకరా

**నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించిన పోలీసులు**



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** ప్రజలకు మాయ మాటలు చెప్పి డబ్బుల వర్షం కురిపిస్తామని రూ. 21 లక్షలు టోకరా వేసిన ముఠాను అరెస్టు చేసిన సంఘటన చేవెళ్ళ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చేవెళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తేదీ 25.07.2025 నాడు ముడిమ్యాల కంచెలో పైసా బారిష్ (డబ్బుల వర్షం) కురిపిస్తామని మాయ మాటలు చెప్పి రూ. 21 లక్షలు, ఒక గ్రాము బంగారు కాయిన్ టోకరా వేసారని కేసు నమోదు కాగా, దర్యాప్తు చేపట్టిన చేవెళ్ళ పోలీసులు 5 గురిని అరెస్టు చేసి వారి నుండి రూ. 18 లక్షల నగదు, ఒక గ్రాము బంగారు కాయిన్, వాటితో పాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మనోరంజన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేర్లతో కూడిన యాభై నాలుగు రూ.500 ఫేక్ నోట్ల కట్టలను, 8 రూ. 100 ఫేక్ నోట్ల కట్టలు స్వాధీనం చేసుకుని, ఐదుగురు నిందితులను రిమాండ్ చేసినట్టు చేవెళ్ల పోలీసులు తెలిపారు. నిందితులు ఐదు మందిలో ఇద్దరు మహారాష్ట్రకు చెందిన వారు కాగా, ముగ్గురు వ్యక్తులు వం-
సగా అదిలాబాద్, మంచిరియాల్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన వారని తెలిపారు. నిందితులు వాళ్ళు అనుకున్న పతకం ప్రకారం ముందుగా పైసా బారిష్ (డబ్బుల వర్షం) కురిసినట్లు ఒక డెమో చేసి ప్రజలను నమ్మిస్తారని, డెమోలో అసలైన నోట్లను పూల మధ్యలో పెట్టి పైసా బారిష్ (డబ్బుల వర్షం) కురిసినట్లు చూయించి, తర్వాత ఫేక్ నోట్లు గాని, లేకపోతే ఈ కేసులో చేసినట్లు ప్రజల డబ్బు తీసుకుని పారిపోవడం చేస్తుంటారని పోలీసులు తెలిపారు. వాళ్ళు ముందుగా వేసుకున్న పథకం ప్రకారం వచ్చేటప్పుడు ఫిర్యాదారుని కారులోనే వచ్చి, ఫిర్యాదు దారునికి తెలియకుండా వేరే కారు తెప్పించుకుని, పూజ చేస్తామని నమ్మ బలికి, పసుపు కుంకుమలతో ముగ్గులు వేసి, నిమ్మకాయలు, అగరుబత్తీలు పెట్టి, ఫోనులు స్విచ్ ఆఫ్ చేయించి, పూజ సమయంలో పెద్ద పెద్ద శబ్దాలు, కాంతులు వస్తాయని నమ్మబలికి, దానికి మీరు తట్టుకోవడం సాధ్యం కాదని ప్రజలను నమ్మించి, అది కేవలం నిందితులకే సాధ్యమని నమ్మ బలికి, ఫిర్యాదు దారున్ని కారులో కూర్చోబెట్టి, డబ్బు తీసుకుని నిందితులు పారిపోతుంటారు. ప్రస్తుత కాలంలో వర్షాలే సరిగా పడడం లేదు, అలాంటిది "పైసా బారిష్ (డబ్బుల వర్షం)" ఎలా పడుతుంది. కావున ఇలాంటి గుర్తు తెలియని వ్యక్తుల మాయ మాటలు నమ్మి మీ యొక్క సొమ్మును పోగొట్టుకోకూడదని ప్రజలకు పోలీసులు సూచించడమైనది. ప్రజలు ఇకమీదటనైన అత్యాశకు పోకుండా, తగిన జాగ్రత్తలు తీసుకొని మోసపోకూడదని పోలీసు వారు సూచించడమైనది.




# బ్యాంకాక్‌లో కాల్పుల కలకలం

## ఆరుగురి మృతి

**బ్యాంకాక్ :** థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఓ దుండగుడు కాల్పులకు తెగపడ్డాడు. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. అనంతరం దుండగుడు తనను తాను కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. స్థానిక మీడియా సంస్థలు వెల్లడించిన వివరాల ప్రకారం.. బ్యాంకాక్‌లోని ఓర్ టు కో మార్కెట్‌లోకి చొరబడిన సాయుధుడు జరిపిన కాల్పుల్లో నలుగురు సెక్యూరిటీ గార్డులు, ఓ మహిళ మృతి చెందారు. ప్రసిద్ధ పర్యాటక ప్రదేశమైన చతుచక్ మార్కెట్ సమీపంలో ఈ ఘటన జరగడంతో స్థానిక ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కాల్పులకు థాయ్‌లాండ్–కంబోడియా సరిహద్దుల వద్ద జరుగుతున్న ఘర్షణలతో ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా బ్యాంకాక్‌లో దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని.. ఇటీవల మే నెలలో కూడా థాంగ్ జిల్లాలోని ఓ పాఠశాల సమీపంలో దుండగుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు.

# విమానం గాల్లో ఉండగా.. బాంబుతో పేల్చేస్తానంటూ కేకలు



**స్కాట్లాండ్ :** విమానం గాల్లో ఉండగా ఓ ప్రయాణికుడు అందరినీ భయభ్రాంతులకు గురిచేశాడు. తన వద్ద బాంబు ఉందని, దాన్ని పేల్చేస్తానంటూ కేకలు వేశాడు. యూకేలోని స్కాట్లాండ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లుటన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఈజీజెట్ విమానం ఆదివారం సాయంత్రం గ్లాస్గోకు బయల్దేరింది. టేకాఫ్ అయిన కొంతసేపటి తర్వాత ఓ ప్రయాణికుడు తన సీట్లో నుంచి లేచి గట్టిగట్టిగా కేకలు వేయడం మొదలుపెట్టాడు. 'నా దగ్గర బాంబు ఉంది. ఈ విమానాన్ని పేల్చేస్తా. అమెరికాకు చావు.. ట్రంప్‌నకు మరణం' అంటూ అరిచాడు. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన సిబ్బంది అతడిని పట్టుకొని బంధించారు. సమీపంలోని ఎయిర్‌పోర్టులో విమానాన్ని అత్యవసరంగా దించేశారు. ల్యాండ్ అవగానే నిందితుడిని పోలీసులకు అప్పగించారు. బెదిరింపులకు పాల్పడిన ప్రయాణికుడి వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు స్కాట్లాండ్ పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్కాట్లాండ్‌లోనే పర్యటిస్తున్నారు. ఈ సమయంలో బెదిరింపుల ఘటన చోటుచేసుకోవడం కలకలం రేపింది.



# థాయ్-కంబోడియా మధ్య కాల్పుల విరమణ

**మలేసియా :** ఆగ్నేయాసియాలో యుద్ధమేఘాలు తొలగిపోయాయి. కొన్ని రోజులుగా సరిహద్దు ఘర్షణలో మునిగిన థాయ్‌లాండ్–కంబోడియా తక్షణమే, షరతుల్లేని కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ విషయాన్ని సోమవారం మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ప్రకటించారు. కొన్నిరోజులుగా సరిహద్దులో కాల్పులతో చెలరేగిపోతున్న థాయ్‌లాండ్–కంబోడియాలు ఎట్టకేలకు కాల్పుల విరమణ చర్చలకు అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. చర్చల కోసం సోమవారం మలేసియాలో భేటీ కావాలని ఇరుదేశాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ క్రమంలోనే సానుకూల ఫలితం వెలువడింది. సరిహద్దు వెంబడి మందుపాతర పేలిన కారణంగా ఐదుగురు థాయ్ సైనికులు గాయపడటంతో ఘర్షణ మొదలైంది. ఇరుదేశాల సైన్యాలు పరస్పరం తేలికపాటి ఆయుధాలు, శతఘ్నులు, రాకెట్లతో దాడి చేసుకున్నాయి. దీంతో కంబోడియాలోని తమ రాయబారిని ఉపసంహరించుకోవడంతోపాటు ఆ దేశ రాయబారిని థాయ్‌లాండ్ బహిష్కరించిన సంగతి తెలిసిందే. తర్వాత అవి తీవ్రరూపం దాల్చాయి. ఈ ఘర్షణలో 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. సుమారు రెండులక్షల మంది నిర్వాసితులు అయ్యారు. ఇక, నోబెల్ శాంతి బహుమతి అందుకోవాలని ఆశపడుతోన్న ట్రంప్ ఈ రెండుదేశాల మధ్యలోకి వచ్చారు. ఇప్పటికే పలు యుద్ధాలను తాను ఆపినట్లు ప్రకటించుకొన్నారు. తాజాగా ఇప్పుడు ఆ జాబితాలోకి థాయ్‌లాండ్ – కంబోడియా ఘర్షణ కూడా చేరింది.

# మరి అప్పుడు కమిటీ ముందు ఎందుకు హాజరయ్యారు?

## జస్టిస్ వర్మను ప్రశ్నించిన సుప్రీం



**న్యూఢిల్లీ :** ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఆరోపణలు ఎదుర్కొం టున్న విషయం తెలిసిందే. త్రిసభ్య విచారణ కమిటీ ఇచ్చిన దర్యాప్తు నివేదికను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. ఈ క్రమంలో సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "మీరు ఈవిధంగా పిటిషన్ దాఖలు చేయకుండా ఉండాల్సింది. త్రిసభ్య విచారణ కమిటీ ఇచ్చిన దర్యాప్తును మీరు సవాల్ చేశారు కాబట్టి ఇక్కడ తొలి ప్రతివాది సుప్రీంకోర్టే అవుతుంది. అలాగే కమిటీ నియామకం జరిగినప్పుడే మీరు సుప్రీంకు ఎందుకు రాలేదు..? ఎందుకు వేచి చూశారు..? గతంలో ఈ విచారణలకు న్యాయమూర్తులు హాజరుకాలేదు. మీరు ఎందు కు హాజరయ్యారు..?" అని ధర్మాసనం ప్రశ్నించింది. నగదు ఎవరిదో కనుక్కోవచ్చని భావించినందున ఆయన విచారణకు హాజరయ్యారని జస్టిస్ వర్మ తరఫు న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. జస్టిస్ వర్మ అవుట్‌హౌస్‌లో దొరికిన నగదు ఆయనదే అని ఎలా చెప్తారని సిబల్ ప్రశ్నించారు. "పోలీసులు, సిబ్బంది, అంతా అక్కడ ఉండగా నగదు దొరికింది" అని ధర్మాసనం పేర్కొనగా.. హైకోర్టు న్యాయమూర్తి సిబ్బంది అక్కడ లేరని సిబల్ అన్నారు. దాంతో విచారణ కమిటీ నివేదిక సరైంది కాదని అంటున్నారా..? అని కోర్టు ప్రశ్నించింది. తన ఉద్దేశం అది కాదని సిబల్ బదులిచ్చారు. ఇక దీనిపై తదుపరి విచారణ వచ్చే బుధవారానికి వాయిదా పడింది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఆవరణలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మంటలను ఆర్పేందుకు వచ్చిన సిబ్బంది వాటిని గుర్తించారు. ఈ ఘటనపై అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా.. అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో ఒక కమిటీని వేశారు. ఆ కమిటీ నోట్ల కట్టలు దొరికింది వాస్తవమేనని తేల్చింది. దీంతో రాజీనామా చేయాల్సిందిగా జస్టిస్ వర్మకు సీజేఐ సూచించారు. ఆయన తిరస్కరించడంతో.. అభిశంసనకు సిఫారసు చేశారు. జస్టిస్ వర్మ అభిశంసనకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# ఈ రక్తం నిజంగా 'బంగారమే'

## అరుదైన ఈ బ్లడ్ గ్రూపు గురించి తెలుసా?



**న్యూఢిల్లీ :** బ్లడ్ గ్రూప్‌లంటే మనకు ఠక్కున గుర్తొచ్చేవి A, B, AB, O రకాలే కదూ! కానీ, మరో అరుదైన రకం ఉందని మీకు తెలుసా? అదీ ప్రపంచంలో కేవలం 50 మంది కన్నా తక్కువమందిలోనే ఉందంటే నమ్ముతారా? కానీ, ఇది నిజం. ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఈ బ్లడ్ గ్రూప్ పేరు 'గోల్డెన్ బ్లడ్'. ప్రపంచవ్యాప్తంగా 50 కన్నా తక్కువమంది మాత్రమే ఈ గ్రూప్ రక్తం పరిధిలోకి వస్తారు. ఇంతకీ ఏమిటీ గోల్డెన్ బ్లడ్?, దీని ప్రత్యేకతలేంటో చూద్దామా! ఎర్రరక్త కణాల్లో Rh యాంటీజన్‌లు లేకపోతే దాన్ని Rh– నల్ రకం లేదా 'గోల్డెన్ బ్లడ్' గ్రూప్ అని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ బ్లడ్ గ్రూప్ కొరత, ప్రత్యేకతల దృష్ట్యా దీనికి ఆ పేరు పెట్టారనుకోవచ్చు. అరుదైన యాంటీజెన్‌లను కలిగిఉన్న వ్యక్తుల్లో గోల్డెన్ బ్లడ్ మూలాలను గుర్తించొచ్చు. ఇవి O పాజిటివ్, O నెగెటివ్, ఎ పాజిటివ్, ఎ నెగెటివ్, బి పాజిటివ్, బి నెగెటివ్, ఏబీ పాజిటివ్, ఏబీ నెగెటివ్ వంటి ప్రసిద్ధ రక్త గ్రూప్‌లను కలిగిఉన్నవారి కన్నా భిన్నంగా ఉంటాయి.

అయితే, 1961లో ఆస్ట్రేలియాకు చెందిన ఓ ఆదివాసీ మహిళ రక్త పరీక్షలు చేయించుకోగా.. ఆమె రక్తంలో A, B లేదా Rh యాంటీజన్‌లు లేవని తేలడంతో తొలిసారి 'గోల్డెన్ బ్లడ్' గ్రూప్ కేసుగా ఇది నమోదైంది. భారత్‌లోనూ ఈతరహా కేసు 2022 జులై 14న వెలుగుచూసింది. గుజరాత్‌కు చెందిన 65 ఏళ్ల వ్యక్తికి గుండెపోటు రావడంతో పరీక్షలు నిర్వహించిన వైద్యులు అతడిది గోల్డెన్ బ్లడ్ గ్రూప్‌గా నిర్ధరించారు. వైద్య రంగంలో ఈ గ్రూప్‌నకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. గోల్డెన్ బ్లడ్ గ్రూప్‌ని ప్రాణప్రదాయినిగా చెప్పొచ్చు. ఎందుకంటే ఈ బ్లడ్ గ్రూప్ విశ్వదాత. ఏ గ్రూప్ వారికి అవసరమైనా.. కళ్లు మూసుకొని గోల్డెన్ గ్రూప్ రక్తం ఎక్కించవచ్చు. రియాక్షన్‌కు ఆస్కారం తక్కువ. కాకపోతే, Rh-null బ్లడ్ గ్రూపు ఉన్న వ్యక్తులు అదే రకమైన దాతల నుంచి మాత్రమే రక్తం పొందాల్సి ఉంటుంది. అందువల్ల ఇది అత్యంత అరుదు, ఖరీదైనదిగా మారింది. ఈ రక్తం ఇమ్యునోగ్లోబులిన్ ఆధారిత ఔషధాలను అభివృద్ధి చేయడంలో కీలకంగా మారుతుంది.



# మెరుపు వేగమే వాటి బలం

## సైన్యంలో రుద్ర, భైరవ..

**న్యూఢిల్లీ :** రుద్ర ఆల్‌ఆర్మ్స్ బ్రిగేడ్, భైరవ లైట్ కమాండో బెటాలియన్లు భారత సైన్యంలో భారీ మార్పులకు బలమైన సంకేతాలు. ఒకే రకమైన ఆయుధాలతో వేల మంది యుద్ధం చేయడం కంటే..తక్కువ మంది సైనికులు విభిన్న ఆయుధాలు, టెక్నాలజీలతో ఏకకాలంలో సమష్టిగా శత్రువుపై విరుచుకుపడేలా వీటిని రూపొందించారు. చైనా, పాక్‌తో ఘర్షణల అనంతరం భారత సైన్యంలో శరవేగంగా చోటు చేసుకొంటున్న మార్పులకు ఇవి చిహ్నం.

### బిపిన్ రావత్ హయాంలో నాంది..

దివంగత సీడీఎస్ బిపిన్ రావత్ హయాంలో సైనిక సంస్కరణలు మొదలయ్యాయి. అప్పుడే ఇంటిగ్రేటెడ్ బ్యాటిల్ గ్రూప్ (ఐబీజీ)లను ఏర్పాటు చేయాలనే ఆలోచన రూపొందింది. దీనిలో ఇన్‌ఫాంట్రీతోపాటు.. శతఘ్ని, రాకెట్, సాయుధ కవచ, ఎయిర్ డిఫెన్స్, సిగ్నల్స్ తదితర బలగాలు మొత్తం ఉంటాయి. ఇది బ్రిగేడ్ సైజ్(3,000) కంటే పెద్దదిగా.. డివిజన్ (10,000)సైజు కంటే చిన్నదిగా ఉంచాలని నిర్దేశించారు. మేజర్ జనరల్ స్థాయి అధికారి వీటికి నాయకత్వం వహిస్తారు. నిర్ణయాలు కూడా వేగంగా తీసుకొంటారు. కేవలం 12 నుంచి 48 గంటల్లో అవసరమైన ప్రాంతాల్లో మోహరించేలా ప్రణాళిక రూపొందించారు. సైనిక చర్యలు చేపట్టాలంటే పదాతి దళాలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లోని శతఘ్ని, సాయుధ వాహనాలు, సిగ్నల్స్,ఎయిర్ డిఫెన్స్ ఇలా పలు యూనిట్లను సిద్ధం చేసుకోవడానికి.. వాటిని సరిహద్దులకు చేర్చడానికి రెండు మూడు వారాల నుంచి నెలల సమయం పడుతోంది. ఆపరేషన్ పరాక్రమ్ సమయంలో చాలా జాప్యం జరిగింది. శత్రువు తాపీగా మన కదలికలను తెలుసుకొందనే విమర్శలూ ఉన్నాయి. ఈ క్రమంలో బ్రిగేడ్ స్థాయిలో అన్ని రకాల వనరులతో సైన్యం సిద్ధంగా ఉండేందుకు వీలుగా వీటిని ప్రతిపాదించారు.

### ఏమిటీ రుద్ర బ్రిగేడ్..?

ప్రస్తుతం ఉన్న రెండు ఇన్‌ఫాంట్రీ (పదాతి దళ) బ్రిగేడ్లను 'రుద్ర'గా మార్చాలని నిర్ణయించారు. వీటిల్లో మెకనైజ్డ్ ఇన్‌ఫాంట్రీ, ట్యాంకులు, శతఘ్నులు, ప్రత్యేక దళాలు, మానవ రహిత విమానాలు, ప్రత్యేకమైన లాజిస్టిక్స్ వ్యవస్థలు, కాంబాట్ సపోర్ట్‌తో వీటిని సిద్ధం చేస్తున్నారు. రుద్ర బ్రిగేడ్‌లు మోహరించే ప్రదేశాల భౌగోళిక పరిస్థితులు, ఆపరేషన్ల ఆధారంగా.. వీటిల్లో వచ్చే బలగాల సమ్మేళనం మారుతుంటుంది. సాధారణంగా వీటిల్లో శతఘ్నులు, డ్రోన్ల నిఘా ఉండటంతో.. ఇవి మన సేనలకు ఆధిపత్యాన్ని ఇస్తా యి. తీవ్ర స్థాయిలో జరిగే స్వల్పకాలిక ఘర్షణలు ఎదుర్కోవడంలో ఇటువంటి బ్రిగేడ్లు ప్రభావవంతంగా ఉంటాయి. ముఖ్యంగా పాక్‌తో సరిహద్దు పంచుకొనే పంజాబ్, గుజరాత్, రాజస్థాన్ వంటి ప్రాంతాల్లో వీటిని మోహరించవచ్చు. పాక్ దుందుడుకు చర్యలకు వెంటనే సమాధానం చెప్పొచ్చు.

### భైరవ లైట్ కమాండో బెటాలియన్లు ఏమిటీ..?

చురుగ్గా సరిహద్దుల్లో మోహరించడానికి.. మెరుపు వేగంతో దాడులు చేయడానికి వీలుగా భైరవ కమాండో బెటాలియన్లు ఏర్పాటు చేసింది. తక్షణమే చేపట్టే టాక్టికల్ ఆపరేషన్స్‌పై భైరవ బెటాలియన్స్ దృష్టిపెడతాయి. సైనిక చర్యకు సర్వసన్నద్ధంగా ఉంటాయి.

### ఇప్పుడే ఎందుకు..?

ఆపరేషన్ పరాక్రమ్ 2001–02 తర్వాత భారత్ వేగంగా బలగాలను మోహరించడంపై దృష్టిపెట్టింది. అప్పుడు అప్పుడే కోల్డ్‌స్టార్ట్ డాక్ట్రిన్ పై దృష్టిపెట్టింది. దీని కోసమే ఐబీజీల ప్రతిపాదన తెరపైకి తెచ్చింది.

### భవిష్యత్తు యుద్ధాల కోసం..

భవిష్యత్తు యుద్ధాల కోసం భారత్ ఇప్పటికే డ్రోన్ ప్లాటూన్లను, లాయిటరింగ్ (గాల్లో తిరుగుతూ శత్రు లక్ష్యంపై దాడి చేసేవి) కమ్యూనిషన్లను, శతఘ్ని రెజిమెంట్లు ఏర్పాటు చేస్తోంది. దీనికి 'దివ్యాస్త్ర ప్రోగ్రామ్'గా పేరు పెట్టింది. ఇక ప్రతిపాదిత ఐబీజీలు, ప్రారంభించిన రుద్ర, భైరవ యూనిట్లను భవిష్యత్తులో మెరుపు వేగంతో శత్రువుపై విరుచుకుపడేలా రూపొందిస్తున్నారు.



# నవాబుపేట్ మోడల్ స్కూల్ లో పురుగుల బియ్యం

- నాణ్యత లేని కూరగాయలను వాడుతున్న మోడల్ స్కూల్
- నామమాత్రపు అధికారుల పర్యవేక్షణ
- పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అధికారులు
- నవాబుపేట్ బిజెపి మండల నాయకులు



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** బియ్యంలో పురుగులు, త్రాగునీటిలో పురుగులు, నాణ్యత లేని కూరగాయలను విద్యార్థులకు అందిస్తున్న సంఘటన వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. సోమవారం వికారాబాద్ జిల్లా పరిధిలోని నవాబుపేట్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ను నవాబుపేట్ బిజెపి మండల అధ్యక్షులు చంద్రకాంత్, వికారాబాద్ జిల్లా కార్యదర్శి సారా జగన్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డిలతో బిజెపి నాయకులు హాస్టల్లో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బియ్యంలోని పురుగులు ఉండటం అధికారులు పర్యవేక్షణకు వచ్చినప్పుడు చూశారా లేదా అని ప్రశ్నించారు. అధికారుల పర్యవేక్షణ నామమాత్రం ఉందని ఈ సంఘటన చూస్తే తెలుస్తుంది అన్నారు. విద్యార్థులకు కూరగాయలు అందించే విషయంలో కూడా నాణ్యతలేని కూరగాయలను తీసుకొస్తున్న ఎందుకు విద్యార్థులకు ఈ రకమైన ఆహారం అందిస్తున్నారని అన్నారు. కనీసం వారానికి ఒకరోజైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి మోడల్ స్కూలు స్థితిగతులను తెలుసుకోవాల్సింది పోయి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటం ఇంతవరకు సరే ఏందో అధికారులు ఆలోచించాలన్నారు. ఈ ఆహారాన్ని భుజించడం ద్వారా విద్యార్థులకు అనారోగ్య సమస్యలు ఏర్పడిన జరగరాని నష్టం జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వారానికి ఒక రోజైన మోడల్ స్కూల్ ను సందర్శించి విద్యార్థుల బాగోగులు తెలుసుకోవాలని, ఆహారం ఏ విధంగా లభిస్తుందని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, యువ మోర్చా అధ్యక్షులు శ్రీహరి గౌడ్, శ్రీధర్ రావు, మాజీ సర్పంచ్ జైపాల్ రెడ్డి, సంపత్, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# శునకాల బెడద.. విచారణను సుమోటోగా ప్రారంభించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ :** దేశంలో వీధి కుక్కల బెడదపై మీడియాలో వచ్చిన కథనాలకు సుప్రీం కోర్టు స్పందించింది. ఈ అంశాన్ని సుమోటోగా విచారణకు స్వీక రించింది. జస్టిస్ జేబీ పార్దివా లా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం వీధి కుక్క ల బెడదను తీవ్రంగా కలవర పరిచే అంశంగా పేర్కొంది. ప్రతి రోజు దేశ రాజధాని ఢిల్లీలో వందలాది వీధి కుక్కల కాటు కేసులు నమోదవుతున్నాయి. కుక్క కాటుతో చిన్నారులు, పెద్దలు ప్రాణాంతక రేబిస్ వ్యాధిబారిన పడి ప్రాణాలు కోల్పోతు న్నారు. దీని సంబంధించిన నివేదికను సమర్పించాలని అ ధికారులను ఆదేశిం చింది. మరోవైపు పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ తెలిపిన సమాచారం ప్రకారం.. గతేడాది దేశవ్యాప్తంగా 37 లక్షల మంది కుక్కకాటుకు గురికాగా.. రేబిస్ వ్యాధి సోకి 54 మంది ప్రాణాలు కోల్పోయారు.



# నిమిష ప్రియ విడుదల కోరుతూ.. యెమెన్‌కు కుటుంబ సభ్యులు

**ఢిల్లీ:** యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియను దేశానికి సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె విడుదలను కోరుతూ నిమిషప్రియ కుటుంబసభ్యులు యెమెన్‌కు వెళ్లారు. ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ తాజాగా ఓ వీడియో షేర్ చేశారు. నిమిష ప్రియను వదిలేయాలని కోరుతూ ఆమె భర్త థామస్, కుమార్తె మిషెల్ అక్కడి ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్న దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి. వారితో పాటు కేఏ పాల్, ఇతరులు ఉన్నారు. తన భార్య మరణశిక్షను తాత్కాలికంగా నిలిపివేసినందుకు నిమిష ప్రియ భర్త థామస్ అక్కడి హూతీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వీడియోలో పాల్ ద్వేషం కంటే ప్రేమ శక్తివంతమైనదిగా పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్న అంతర్యుద్ధంతో అతలాకుతలమైన యెమెన్‌లో శాశ్వత శాంతి కోసం మధ్యవర్తిత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొంటూ..నిమిష ప్రియను విడుదల చేయాలని అక్కడి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యెమెన్ జాతీయుడి హత్యకేసులో నిమిషకు మరణశిక్ష పడిన సంగతి తెలిసిందే. నిమిష, బాధిత కుటుంబాలు పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించుకునేందుకు మరింత సమయం ఇవ్వాలని యెమెన్ ప్రభుత్వాన్ని భారత్ పలుమార్లు కోరడంతో జులై 16న అమలు కావాల్సిన మరణశిక్షను వాయిదా వేశారు. అయితే మృతుడు తలాల్ అదిబ్ మెహది కుటుంబం మాత్రం ఆమెకు శిక్ష పడాల్సిందేనని పట్టుబడుతోంది. దీంతో నిమిష ప్రియ కేసులో ఏమి జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. కేఏ పాల్ పర్యటనకు సంబంధించి భారత విదేశాంగశాఖ ఎటువంటి ప్రకటన ఇవ్వలేదు. ఆయనకున్న అంతర్జాతీయ పరిచయాలతో యెమెన్ వెళ్లినట్టు తెలుస్తోంది.

# చివరి టెస్టులో గెలవండి..
# దేశం కోసం సాధించండి

## రిషభ్ పంత్ సందేశం




మాంచెస్టర్ వేదికగా జరిగిన టెస్టులో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌ను భారత్ డ్రా చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్ గాయంతోనే క్రీజ్‌లోకి వచ్చి హాఫ్ సెంచరీ సాధించాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ అవసరమైతే పంత్ బ్యాటింగ్‌కు వస్తాడని బీసీసీఐ ముందే చెప్పింది. కానీ, ఆ అవసరం రాకుండానే భారత బ్యాటర్లు అద్భుతంగా పోరాడారు. గాయం కారణంగా రిషభ్ పంత్ ఐదో టెస్టుకు దూరమైన క్రమంలో భారతజట్టుకు తన సందేశం ఇచ్చాడు. చివరి టెస్టులో గెలిచి దేశం కోసం అందిద్దామని పిలుపునిచ్చాడు. "నా జట్టుకు ఒకేఒక్క మెసేజ్ ఇస్తున్నా. గయ్స్ మనం గెలుద్దాం. దేశం కోసం చేద్దాం. వ్యక్తిగత లక్ష్యం గురించి ఆలోచించకుండా జట్టును గెలిపించేందుకు లేదా ముందుకు తీసుకెళ్లేందుకు ఏం చేయాలనేది వ్యక్తిగతంగా చేయాలనుకుంటా. సహచరులంతా ఇలాంటి సమయంలో అండగా నిలవడం బాగుంది. దేశం కోసం ఆడేటప్పుడు జట్టు ఒత్తిడిలో ఉన్నా సరే ప్రతిఒక్కరూ మద్దతు ఇస్తారు. అలాంటి భావోద్వేగాలను వివరించడం చాలా కష్టం. నా దేశం తరఫున ఆడడాన్ని ఎప్పుడూ గర్వంగానే భావిస్తుంటా" అని పంత్ వెల్లడించాడు.

### ఈ టెస్టుకు పంతే ఫౌండేషన్: గంభీర్

"నేనెప్పుడూ వ్యక్తిగత ప్రదర్శనల గురించి మాట్లాడను. నాకు అది ఇష్టం ఉండదు. కానీ, మాంచెస్టర్ టెస్టులో మాత్రం రిషభ్ పంత్ హాఫ్ సెంచరీతో చేసిన ఫౌండేషనే కీలకం. ఈసందర్భంగా పంత్‌కు అభినందనలు. కేవలం డ్రెస్సింగ్ రూమ్‌లోనే స్ఫూర్తి నింపలేదు. భావితరాలకూ ఇన్సిపిరేషన్. దేశం నీపట్ల ఎప్పుడూ గర్వంగానే ఉంటుంది" అని భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వ్యాఖ్యానించాడు.

### సూపర్ కమ్‌బ్యాక్ : సచిన్

"ఓల్డ్ ట్రాఫోర్డ్ టెస్టు అత్యంత కీలకమని భారత్‌కు తెలుసు. ఒక దశలో వెనకబడినప్పటికీ పుంజుకున్న తీరు అద్భుతం. కంగ్రాట్స్ టీమ్‌ఇండియా. కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ ఆడినవి సూపర్ ఇన్నింగ్స్‌లు. పోరాడేతత్వం ప్రదర్శించిన జట్టుకు అభినంద నలు. చివరి టెస్టులోనూ విజయం సాధించాలని కోరుకుం టూ ఆల్‌ది బెస్ట్" అని సచిన్ పోస్టు చేశాడు.



## ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌గా దివ్య దేశ్‌ముఖ్

ఫిడే ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌గా దివ్య దేశ్‌ముఖ్ (19) నిలిచారు. ఆమె తన ప్రత్యర్థి కోనేరు హంపీపై విజయం సాధించారు. ఫైనల్స్‌లో వీరిద్దరి మధ్య జరిగిన తొలి ర్యాపిడ్ టై బ్రేకర్ డ్రాగా ముగియగా.. రెండో గేమ్‌లో మొత్తం 75 ఎత్తుల్లో దివ్య విజయం సాధించారు. చివరి టైబ్రేకర్‌లో దివ్య తెల్లపావులతో బరిలోకి దిగారు. 2025 ఫిడే మహిళల ప్రపంచ కప్ ఫైనల్స్‌కు చేరిన తొలి క్రీడాకారిణిగా ఆమె నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే టోర్నీలో విజేతగా ఆవిర్భవించిన తొలి క్రీడాకారిణి కూడా ఆమే. ఫైనల్స్‌లో దివ్య 1.5 పాయింట్లు.. కోనేరు హంపి 0.5 సాధించారు. ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో కోనేరు హంపీ తీవ్రమైన పోటీ ఇచ్చారు. దీంతో ఫలితం నేడు టైబ్రేకర్‌కు చేరింది. నిన్న జరిగిన మ్యాచ్‌లో దివ్య కూడా దూకుడుగానే ఆడింది. ఓ దశలో హంపీని ఒత్తిడికి గురి చేసింది. తాజా విజయంతో దివ్య గ్రాండ్ మాస్టర్ హోదాను అందుకొన్నారు. దీంతో భారత్‌లో ఈ హోదా అందుకొన్న 88వ వ్యక్తిగా నిలిచారు.

## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు



**ముంబయి :** దేశీయ మార్కెట్లు సోమవారం నష్టాలను మూటగట్టుకున్నాయి. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి, కీలక రంగాల షేర్లలో అమ్మకాలను మార్కెట్లను కుదిపేశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, రియల్టీ రంగ సూచీలు నష్టపోవడం సూచీలను కిందకు పడేసింది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 570 పాయింట్లకు పైగా నష్టపోయింది. నిఫ్టీ 24,700 మార్క్‌ను కోల్పోయింది. ఈ ఉదయం 81,299.97 వద్ద స్వల్ప నష్టంతో ప్రారంభమైన సెన్సెక్స్ తొలుత కాస్త కోలుకున్నట్లు కన్పించింది. కానీ, మధ్యాహ్నం తర్వాత మరింత పతనమైన సూచీ.. ఇంట్రాడేలో 80,776.44 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 572.07 పాయింట్లు కిందకు వెళ్లి 80,891.02 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 156.10 పాయింట్లు నష్టపోయి 24,680.90 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు తగ్గి 86.66గా ముగిసింది. ఫార్మా మినహా అన్ని రంగాల సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. రియల్టీ సూచీ ఏకంగా 4 శాతం పతనమైంది. మీడియా సూచీ దాదాపు 3శాతం, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, లోహ, టెలికాం రంగ సూచీలు 1-1.5 శాతం మేర పడిపోయాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, సిప్లా, హీరో మోటార్స్, ఎస్‌బీఐ లైఫ్, హిందుస్థాన్ యునిలివర్ షేర్లు రాణించగా.. కొటక్ మహీంద్రా బ్యాంక్, విప్రో, బజాజ్ ఫైనాన్స్, ఎయిర్‌టెల్, ఇండస్ ఇండ్‌బ్యాంక్ షేర్లు కుదేలయ్యాయి. త్రైమాసిక ఫలితాల ఎఫెక్ట్‌తో కొటక్ మహీంద్రా షేర్లు దాదాపు 7.34శాతం పతనమయ్యాయి. టీసీఎస్ షేర్లు 1.59శాతం కుంగాయి.

## 25శాతం మందే ఆన్‌లైన్‌లో షాపింగ్



బయటకువెళ్లి వేచి చూసే పని లేకపోవడం, ఊరించే ఆఫర్లు.. ఇవన్నీ కలిసి ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అయితే అమెరికా, చైనాతో పోల్చుకుంటే ఈ విషయంలో భారత్ నాలుగు అడుగులు వెనకే ఉంది. భారత్‌లో 850 మిలియన్ల (85 కోట్లు) మంది ఇంటర్నెట్ వినియోగదారులున్నప్పటికీ వారిలో 20-25 శాతం మాత్రమే ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు చేస్తున్నారని గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ మెకెన్సీ వెల్లడించింది. రానున్న రోజుల్లో భారత ఈ కామర్స్ రంగం గణనీయమైన వృద్ధి సాధించడానికి అవకాశం ఉందని పేర్కొంది. అమెరికా, చైనాల్లో ఇంటర్నెట్ వినియోగదారుల్లో 85 శాతం మంది ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నారని పేర్కొంది. గత కొన్ని సంవత్సరాలుగా భారత్‌లో ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వారి సంఖ్య భారీగా పెరిగిందని వెల్లడించింది. భారతీయులు ఈతరహా షాపింగ్ వైపు మొగ్గుచూపడమే గాకుండా కొత్త ఆలోచనలతో ఈ కామర్స్ రంగం వృద్ధికి దోహదం చేస్తున్నారు. నిమిషాల వ్యవధిలో వస్తువులను ఇంటికి తెచ్చిచ్చే క్విక్ కామర్స్ వేదికలు అందుకు నిదర్శనమని తెలిపింది. కాగా.. 2023 నాటికి దేశ రిటైల్ అమ్మకాల్లో ఈ కామర్స్ వాటా 7 నుంచి 9 శాతంగా ఉండగా.. అది 2030 నాటికి రెట్టింపు అవుతుందని అంచనాలు ఉన్నాయి.




## మీ యూఏఎన్ నంబర్ మర్చిపోయారా?
### ఇలా తెలుసుకోండి..

ఈపీఎఫ్ ఖాతాదారులకు యూఏఎన్ నంబర్ చాలా కీలకం. ఉద్యోగ భవిష్యనిధి సంస్థ తమ సభ్యులకు కేటాయించే 12 అంకెల సంఖ్య. దీని ద్వారా సభ్యులు ఆన్‌లైన్‌లో ఈపీఎఫ్ ఖాతాకు సులభంగా లాగిన్ అవ్వొచ్చు. పీఎఫ్ బ్యాలెన్స్ తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలు, కేవైసీ, బ్యాంకు ఖాతా వివరాలను అప్‌డేట్, ఖాతాల విలీనం వంటివి చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో క్లెయిమ్ చేయాలన్నా ఈ యూఏఎన్ తప్పనిసరి. అలాంటి ఈ సంఖ్య మీ వద్ద లేకపోతే కొన్ని సింపుల్ టిప్స్ ద్వారా తిరిగి పొందొచ్చు.

- ఈపీఎఫ్ఓ అధికారిక వెబ్‌సైట్ epfindia.gov.in పోర్టల్‌కు వెళ్లండి. ఆ పేజీలో ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన వివిధ సేవలు అందుబాటులో ఉంటాయి.
- హోమ్ పేజీలో 'సర్వీసెస్' సెక్షన్‌కు వెళ్లాలి. దాంట్లో 'ఫర్ ఎంప్లాయీస్' అని ఉంటుంది. దానిపై క్లిక్ చేయాలి. అక్కడ పీఎఫ్ బ్యాలెన్స్ తనిఖీలు, యూఏఎన్‌కు సంబంధించిన అనేక రకాలు సేవలు ఉంటాయి.
- 'ఫర్ ఎంప్లాయీస్' సెక్షన్ కింద ఉన్న 'మెంబర్ యూఏఎన్/ ఆన్‌లైన్ సర్వీసెస్' పై క్లిక్ చేయండి. అక్కడ యూఏఎన్‌ను తిరిగి పొందడం, కేవైసీ అప్‌డేట్, పాస్‌బుక్ యాక్సెస్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయి.
- 'మెంబర్ యూఏఎన్/ ఆన్‌లైన్ సర్వీసెస్' క్లిక్ చేసి ఈపీఎఫ్ఓ రికార్డుల ప్రకారం మీ పూర్తి పేరు, పుట్టిన తేదీ, పాన్, ఆధార్ వంటి మీ వ్యక్తిగత వివరాలను నమోదు చేయండి. మీ మొబైల్ నంబర్ ఎంటర్ చేసి, క్యాప్చా టైప్ చేశాక 'రిక్వెస్ట్ ఓటీపీ' పై క్లిక్ చేయండి.
- ఇప్పుడు మొబైల్ నంబర్‌కు వన్ టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దాన్ని ధ్రువీకరించడానికి మీకొచ్చిన ఓటీపీని ఎంటర్ చేయండి. తర్వాత 'షో మై యూఏఎన్' పై క్లిక్ చేయండి. మీ యూనివర్సల్ అకౌంట్ నంబర్ స్క్రీన్‌పై కనిపిస్తుంది.

## చరిత్రాత్మక కనిష్ఠానికి పొదుపు ఖాతా వడ్డీ రేట్లు : ఆర్‌బీఐ




**ముంబయి:** పొదుపు ఖాతాల్లోని నగదు నిల్వలపై కొన్నిబ్యాంకులు అందిస్తున్న వడ్డీ రేట్లు చరిత్రాత్మక కనిష్ఠానికి తగ్గాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బులెటిన్ వెల్లడించింది. ఈ ఖాతాలకు డిపాజిట్ రేటును బ్యాంకులు సొంతంగా నిర్ణయించుకోవచ్చని ఆర్‌బీఐ 2011 అక్టోబరులో ప్రకటించింది. అప్పట్లో 4% వద్ద ఉన్న ఈ వడ్డీ రేటును చాలా బ్యాంకులు ఇప్పుడు 2.5 శాతానికి కుదించాయి. ఎస్‌బీఐతో పాటు బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ప్రైవేటు రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ బ్యాంక్‌లు పొదుపు ఖాతాల్లోని నిల్వలపై వడ్డీ రేటును 2.5 శాతంగా అందిస్తున్నాయి. ఇదిలా ఉంటే, చిన్నమొత్తాల పొదుపు ఖాతాల వడ్డీ రేట్లను ప్రభుత్వం ప్రస్తుత జులై-సెప్టెంబరు త్రైమాసికంలో 4% వద్ద మార్పు లేకుండా ఉంచింది.

## భారత్‌లో స్టార్‌లింక్‌కు 20 లక్షల కనెక్షన్లు మాత్రమే
### కేంద్రమంత్రి పెమ్మసాని




బిలియనీర్ ఎలాన్‌మస్క్ నేతృత్వంలో శాటిలైట్ సేవలందించే స్టార్‌లింక్.. భారత్‌లో గరిష్ఠంగా 20 లక్షల కనెక్షన్లకు మాత్రమే సేవలందించగలదని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇది గరిష్ఠంగా 200 ఎంబీపీఎస్ స్పీడ్‌ను అందించగలదని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వరంగ టెలికాం సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్‌తో పాటు ఇతర టెలికాం సంస్థలపై దీని ప్రభావం తక్కువగానే ఉంటుందని పేర్కొన్నారు. స్టార్‌లింక్ సేవల ప్రారంభ ఖర్చు ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. నెలవారీ ఛార్జీలు సుమారు రూ.3 వేల వరకు ఉండొచ్చని ఆయన తెలిపారు. బీఎస్ఎన్ఎల్ విస్తృతంగా సేవలందించే గ్రామీణ, మారుమూల ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ శాట్‌కామ్ సేవలందించాలని భావిస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల విస్తరణ పూర్తయినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం టారిఫ్‌లు పెంచే ప్రతిపాదనలు లేవని స్పష్టం చేశారు.

## కృత్రిమ మేధను తేలిగ్గా తీసుకుంటున్నారు
### ఏఐ పితామహుడు



టెక్ దిగ్గజాలు కృత్రిమమేధ ముప్పును తక్కువ అంచనా వేస్తున్నాయని ఏఐ పితామహుడు జెఫ్రీ హింటన్ వ్యాఖ్యలు చేశారు. ఏఐతో తలెత్తే ప్రమాదాలను టెక్నాలజీ కంపెనీలు పట్టించుకోవ డం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లా డారు. "కీలక శాస్త్రవేత్తలు ఏఐ ముప్పును తక్కువ చేసి చెప్తున్నారని నా అభిప్రాయం. డెమిస్ హస్సాబిస్ (డీప్‌మైండ్ సంస్థ సీఈఓ) వంటివారు ఈ ముప్పును అర్థం చేసుకొని, దానిని ఎదుర్కొనేందుకు పనిచేయాలనుకుంటున్నారు. తొలినాళ్లలో ఈ ప్రమాదాన్ని గుర్తించనందుకు చింతిస్తున్నాను" అని అన్నారు. దశాబ్దం పాటు సేవలు అందించి 2023లో హింటన్ గూగుల్‌ను వీడారు. ఏఐని విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావడానికి గూగుల్ చేస్తోన్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఆయన వెళ్లిపోయారని అప్పట్లో కథనాలు వెలువడ్డాయి. అయితే అందులో వాస్తవం లేదని తాజాగా ఆయన వెల్లడించారు. అప్పటికి తన వయసు 75 ఏళ్లని, ఆశించినమేర పనిచేయలేకపోవడం వల్లే ఆ సంస్థను వీడినట్లు చెప్పారు. అయితే ఇప్పుడు తాను ఏఐ ముప్పు గురించి స్వేచ్ఛగా మాట్లాడగలనని వ్యాఖ్యానించారు. ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌లలో చేసిన కృషికిగానూ హింటన్‌కు 2024లో ఫిజిక్స్ విభాగంలో నోబెల్ వరించింది. ఆ రంగంలో దశాబ్దకాలం పాటు ఆయన చేసిన కృషి ఫలితమే ఇప్పుడు ఏఐ విప్లవానికి దోహదం చేసింది. కృత్రిమ మేధ ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. దానిపై గూగుల్ డీప్‌మైండ్ సీఈఓ డెమిస్ హస్సాబిస్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవడం కంటే దాని దుర్వినియోగమే అత్యంత ప్రమాదకరమని అన్నారు. ఒకవేళ అలా జరిగితే వినాశకర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వ్యక్తులకు వీటి యాక్సెస్‌ను పరిమితం చేయాలని సూచించారు.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం   తెలుగు దిన పత్రిక



# సంగీత దర్శకుడు ఇళయరాజాకు సుప్రీంలో నిరాశ

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. తన 500కి పైగా పాటలకు సంబంధించిన కాపీరైట్ వివాదాన్ని బాంబే హైకోర్టు నుంచి మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ ఇళయరాజా సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, న్యాయమూర్తులు జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఇప్పటికే ఈ కేసుపై బాంబే హైకోర్టు విచారణ ప్రారంభించిన తర్వాత మద్రాసు హైకోర్టుకు ఎలా బదిలీ చేస్తారని.. సోనీ మ్యూజిక్ ఎంటర్‌టైన్‌మెంట్ తరఫు న్యాయవాది సుప్రీంలో ప్రశ్నలు లేవనెత్తారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం సుప్రీం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. ఎకో, ఏఐజీ మ్యూజిక్ కంపెనీలు ఇళయరాజా స్వరపరిచిన పలు పాటలను ఉపయోగించుకునేలా గతంలో ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయితే కాపీరైట్ గడువు ముగిసినా, తన పాటలను ఇంకా వాడుకుంటున్నారంటూ ఎకో, ఏఐజీ మ్యూజిక్ కంపెనీలపై సంగీత దర్శకుడు ఇళయరాజా 2014లో మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. అప్పట్లో ఈ పిటిషన్‌పై విచారించిన మద్రాసు హైకోర్టు, నిర్మాతల నుంచి హక్కులు పొందిన తర్వాత ఇళయరాజా పాటలను వినియోగించుకొనే హక్కు సంగీత సంస్థలకు ఉంటుందని, ఇళయరాజాకు కూడా వ్యక్తిగతంగా హక్కు ఉంటుందని 2019లో ఉత్తర్వులు జారీ చేసింది. ఇళయరాజా పాటలను ఉపయోగించకుండా ఆ మ్యూజిక్ కంపెనీలపై మధ్యంతర నిషేధం విధించింది. సంగీతం అందించినందుకు ఇళయరాజాకు నిర్మాత డబ్బులు



చెల్లించారని, అందుకే హక్కులు నిర్మాతకే దక్కుతాయని తెలిపింది. మద్రాసు హైకోర్టులో ఆ కేసుపై దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో 2022లో సోనీ మ్యూజిక్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇళయరాజా మ్యూజిక్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన 536 పాటలను వినియోగించకుండా బాంబే హైకోర్టును ఆశ్రయించడంతో ఈ కాపీరైట్ వివాదం మొదలైంది. ఈ పాటలపై హక్కులు, ఎకో రికార్డింగ్ తమ పరిధిలో ఉన్నాయని సోనీ వాదించింది. అయితే ఇళయరాజా కంపోజ్ చేసిన 536 పాటల్లో పలు పాటలకు సంబంధించిన కేసు అప్పటికే మద్రాసు హైకోర్టులో నడుస్తుండడంతో ఈ కేసును మద్రాసు హైకోర్టుకు బదిలీ చేయాలని ఇళయరాజా సుప్రీంను ఆశ్రయించారు.

## 'కింగ్డమ్' సెన్సార్ రిపోర్టు.. రన్‌టైమ్ ఎంతంటే?

విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కిన స్పై యాక్షన్ డ్రామా మూవీ 'కింగ్డమ్'. ఈ నెల 31న విడుదల కానున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు తాజాగా పూర్తయ్యాయి. యూ/ఏ సర్టిఫికెట్ పొందిన ఈ మూవీ రన్‌టైమ్ 160 నిమిషాలు (2.40 గంటలు). సెన్సార్ బోర్డు సూచనల మేరకు చిత్ర బృందం ఆరు చోట్ల మార్పులు చేసింది. ఒక డైలాగ్‌ను మ్యూట్ చేయడం, ఓ అసభ్యకర పదాన్ని తొలగించడం, వయలెన్స్ ఎక్కువగా ఉన్న సన్నివేశాలను సీజీతో కవర్ చేయడం వంటి మార్పులు చోటు చేసుకున్నాయి. మరోవైపు, చిత్ర బృందం విజ్ఞప్తి మేరకు.. టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. సినిమా విడుదల రోజు నుంచి పది రోజుల పాటు ధరల పెంపునకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌ల్లో రూ.75 (జీఎస్టీతో కలిపి) పెంచుకునేందుకు వీలు కల్పించింది. సినిమా విడుదల సమయం సమీపిస్తుండటంతో విజయ్ ప్రచారంలో పాల్గొని, అభిమానుల్లో జోష్ నింపుతున్నారు. హైదరాబాద్‌లోని సారథి స్టూడియోస్‌కు సోమవారం తరలివచ్చిన ఫ్యాన్స్‌ను ఆయన కలిసి, ఫొటోలు దిగారు. ఫొటోషూట్ అనంతరం తమకు విజయ్ భోజనం ఏర్పాటు చేశారంటూ కొందరు సోషల్ మీడియా వేదికగా ఆనందాన్ని పంచుకున్నారు. మరోవైపు, యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ ఏర్పాటు చేసింది.

## మాస్ ఎమోషనల్ డ్రామాగా పెద్ది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్నతాజా చిత్రం 'పెద్ది' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆర్ఆర్ఆర్ తర్వాత 'గేమ్ ఛేంజర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చరణ్ ఈ చిత్రంతో నిరాశపరిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ఫెయిల్యూర్‌ను మరిచిపోయేలా, ఓ మాస్ ఎమోషనల్ డ్రామాతో వస్తున్నాడు చరణ్. రంగస్థలం తర్వాత రామ్ చరణ్ కోసం మరో డెప్త్ ఉన్న క్యారెక్టర్ డిజైన్ చేసిన దర్శకుడు బుచ్చిబాబు పెద్ది సినిమాను స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిస్తున్నారు. క్రికెట్, కబడ్డీ, కుస్తీ వంటి స్థానిక ఆటల నేపథ్యంలో సినిమా సాగనుందని సమాచారం. చరణ్ ఇందులో 'ఆట కూలీ' పాత్రలో కనిపించనున్నట్టు టాక్. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. చరణ్ గెటప్ కూడా మరీ డిఫరెంట్‌గా ఉండటంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ సినిమాకు మ్యూజిక్ మాస్ట్రో ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇటీవల రామ్ చరణ్ న్యూ బల్కీ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా నుంచి ఫస్ట్ సాంగ్‌ను ఆగస్టు 25, 2025, వినాయక చవితి సందర్భంగా విడుదల చేయనున్నారట. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది. గ్లింప్స్ మూవీపై అంచనాలు పీక్స్‌కి తీసుకెళ్లగా, ఇప్పుడు ఏఆర్ రెహమాన్ సంగీత సారథ్యంలో రూపొందుతున్న సాంగ్స్ అభిమానులకి పూనకాలు తెప్పించడం గ్యారెంటీ– అంటున్నారు. పెద్ది' సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సినిమా స్కేల్, టెక్నికల్ టీమ్, నటీనటుల ఎంపిక అన్నీ చూస్తే ఇది రామ్ చరణ్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవబోతుందని అభిమానులు నమ్ముతున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. ఇటీవల రామ్ చరణ్ జిమ్ లుక్ ఒకటి వైరల్ కాగా, అది చూసిన ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయారు. అచ్చం హాలీవుడ్ హీరోలా ఉన్నాడంటూ కామెంట్స్ చేశారు.




## ఆ అభిమాని ఇచ్చిన రూ.72 కోట్ల ఆస్తిని.. వారి కుటుంబానికే ఇచ్చేశా

**సంజయ్‌దత్**



తనకు గతంలో ఓ అభిమాని ఇచ్చిన రూ.72 కోట్ల ఆస్తిని తాను తిరిగి వారి కుటుంబానికే ఇచ్చివేసినట్లు బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. 2018లో వార్తల్లో నిలిచిన ఈ విషయం గురించి ఆయన మాట్లాడారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోన్న నిషా పాటిల్ అనే అభిమాని అప్పట్లో తన ఎస్టేట్ మొత్తాన్ని సంజయ్ దత్ పేరిట రాశారు. ఆమె తన తదనం తరం సంపదనంతా సంజయ్‌కు బదిలీ చేయాలని బ్యాంకుకు కూడా సూచించినట్లు సమాచారం. అయితే సంజయ్ దత్ ఈ విషయం మీద క్లారిటీ ఇచ్చారు. 'నేను ఆ ఆస్తిని ఆమె కుటుంబ సభ్యులకే ఇచ్చేశా' అని తేల్చి చెప్పారు. ఈ సంవత్సరం ప్రారంభంలో విడుదలైన 'భూత్నీ', 'హౌస్‌ఫుల్ 5' బాలీవుడ్ చిత్రాల్లో సంజయ్ దత్ నటించారు. నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న 'అఖండ 2'లోనూ ఆయన కనిపించనున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 25న విడుదల కానుంది.

## హిరణ్యకశిపుడిగా రానా/మోహన్‌లాల్

**'మహావతార్ నరసింహ' డైరెక్టర్**





మన పురాణాలను తెరపై చూసేందుకు ప్రేక్షకులు ఎంతో ఆసక్తి చూపిస్తారన్నది 'మహావతార్ నరసింహ' చిత్రంతో మరోసారి రుజువైంది. ఈ నెల 25న విడుదలైన ఈ యానిమేషన్ మూవీ అంతటా మంచి ఆదరణ దక్కించుకుంది. ఈ విజయోత్సాహంలో దర్శకుడు అశ్విన్‌కుమార్ జాతీయ మీడియాతో మాట్లాడారు. ఒకవేళ యామినేషన్ కాకుండా నటులతోనే ఈ సినిమాని తీయాల్సి వచ్చినా.. నరసింహస్వామిని మాత్రం డిజిటల్ రూపంలోనే చూపించేవాడినని తెలిపారు. హిరణ్యకశిపుడిగా రానా, మోహన్‌లాల్, విజయ్ సేతుపతిలో ఎవరో ఒకరిని ఎంపిక చేసేవాడినని అన్నారు. ఆ పాత్రకు ముగ్గురూ పర్‌ఫెక్ట్ అని అభిప్రాయం వ్యక్తం చేశారు. యానిమేటెడ్ మూవీగా ఎందుకు తెరకెక్కించారన్న ప్రశ్నకు సమాధానామిస్తూ.. "ఈ సినిమా పూర్తవడానికి నాలుగున్నరేళ్లు పట్టింది. ఒక్క ప్రాజెక్టు కోసం ఏ నటుడైనా అంత సమయం కేటాయిస్తారనుకోవడం నమ్మశక్యం కాదు. ముఖ్యంగా నాలాంటి కొత్త దర్శకుడి విషయంలో అది కష్టం. అందుకే డిజిటల్ టూల్స్‌తోనే ఆయా పాత్రలను సృష్టించాం" అని వివరించారు. మహావిష్ణువు దశావతారాల ఆధారంగా వరుస చిత్రాలు రానున్నాయి. అలా 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'లో తెరకెక్కిన తొలి సినిమా ఇది. 'కేజీయఫ్', 'కాంతార', 'సలార్'లాంటి హిట్ సినిమాల నిర్మాణ సంస్థ హొంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. యానిమేషన్ మూవీ కావడంతో పెద్దగా ప్రచారం లేకపోయినా.. మౌత్‌టాక్‌తోనే రోజురోజుకూ కలెక్షన్స్ పెంచుకుంటూ వెళుతోంది. ఆదివారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా రూ.11.25 కోట్లు (గ్రాస్) వసూలు చేసిందని మేకర్స్ ప్రకటించారు. ఈ నెల 31న చిత్రాన్ని విదేశాల్లో విడుదల చేయనున్నట్టు తెలిపారు. హిరణ్యకశిపుడికి, నరసింహుడికి మధ్య జరిగే యుద్ధం, నేపథ్య సంగీతం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

## అమెజాన్‌లో 8నుంచి అరేబియా కడలి స్ట్రీమింగ్

సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన సిరీస్ 'అరేబియా కడలి' ఓటిటి వేదికగా విడుదలవుతోంది. సూర్యకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీకి స్టార్ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి దీనికి రైటర్‌గా పని చేయడంతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరించారు. దీంతో ఈ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. అమెజాన్‌లో ఆగస్టు 8 నుంచి అందుబాటులోకి రానున్నట్లు– తెలిపింది. తెలుగు, తమిళ్, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లోనూ ఇది అందుబాటులోకి రానున్నట్లు– అమెజాన్ ప్రైమ్ తెలిపింది. 'కాలానికి అందరూ సమానమే. అందరూ ఒడుదొడుకులను ఎదుర్కోవాల్సిందే' అంటూ పోస్టర్‌ను పంచుకుంది. రెండు గ్రామాలకు చెందిన కొందరు మత్స్యకారులు అనుకోకుండా బార్డర్ క్రాస్ చేస్తారు. దీంతో వాళ్లను విదేశీ జైల్లో బంధిస్తారు. అక్కడినుంచి వాళ్లు ఎలా బయటకు వచ్చారనే కథాంశంతో ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఇది రూపొందింది. 2024లోనే దీని చిత్రీకరణ ప్రారంభించారు. అయితే ఇటీవల ఇదే కథాంశంతో



కొన్ని చిత్రాలు రూపొందినప్పటికీ ఈ కథ ఒరిజినల్ అని సంస్థ పేర్కొంది. ఇందులో సత్యదేవ్ సరసన ఆనంది నటించారు.



## 'హరిహర వీరమల్లు' నుంచి కొన్ని సన్నివేశాలు తొలగింపు

దాదాపు అయిదేళ్ల చిత్రీకరణ తర్వాత.. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన.. 'హరిహర వీరమల్లు' భారీ అంచనాల మధ్య జులై 24న థియేటర్లలో విడుదలైంది. అయితే ఈ సినిమాలో కొన్ని సన్నివేశాల్లో వీఎఫ్ఎక్స్ సరిగా లేవని సోషల్ మీడియా వేదికగా చర్చ జరుగుతోంది. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఆ చిత్ర బృందం అలాంటి కొన్ని సన్నివేశాలను సినిమా నుంచి తొలగించింది. హీరో, అతడి అనుచరులు కొండ అంచున గుర్రాలపై స్వారీ చేసే సీన్‌ను కుదించారు. అలాగే జెండా సన్నివేశాన్ని పూర్తిగా తొలగించారు. పవన్ బాణాలు సంధించే యాక్షన్ సీన్‌లో చిన్నచిన్న మార్పులు చేశారు. క్లైమాక్స్ నిడివి కూడా బాగా తగ్గింది. ఇలా మొత్తంగా 10 నుంచి 15 నిమిషాల ఫుటేజీని సినిమా నుంచి తొలగించారు. ప్రస్తుతం థియేటర్లలో ఈ సవరించిన వెర్షనే ప్రదర్శితమవుతోంది. అయితే ఈ సన్నివేశాల తొలగింపు గురించి చిత్రబృందం ఎలాంటి ప్రకటన చేయలేదు.

## విఎఫెక్స్ పనుల్లో విశ్వంభర

### సెప్టెంబర్‌కు విడుదల అనుమానమే?

మెగాస్టార్ చిరంజీవి హీరోగా యంగ్ దర్శకుడు వసిష్ఠ మల్లిడి డైరెక్షన్ లో వస్తున్ సోషియో ఫాంటాషి సినిమా 'విశ్వంభర'. చిరు సరసన కోలీవుడ్ స్టార్ బ్యూటీ– త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. వంశి ప్రమోద్ భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. అనుకోని కారణాల వలన షూటింగ్ డిలే అవుతూ వస్తున్న ఈ సినిమా స్పెషల్ సాంగ్ షూటింగ్ ను ఇటీవల ఫినిష్ చేసారు. మౌని రేయ్ చిరు సరసన స్టెప్పులేస్తోంది. దాంతో షూటింగ్ మొత్తం పూర్తిఅయింది. ఎప్పుడో విడుదల కావాల్సిన విశ్వంభర విఎఫెక్స్ వర్క్ కారణంగా వాయిదా పడుతూ వస్తోంది. విశ్వంభర రిలీజ్ కు వచ్చిన నెగిటివ్ కామెంట్స్ ను దృష్టిలో పెట్టుకుని రీ వర్క్ చేస్తున్నారు. దాదాపు రూ. 75 కోట్లు– విఎఫెక్స్ కోసం ఖర్చు పెడుతోంది. ఇదిలా ఉండగా విఎఫెక్స్ వర్క్ ఆగస్టు చివరి నాటికి ఫినిష్ అవుతుందని సెప్టెంబర్ 25 న విశ్వంభర రిలీజ్ అని టాలీవుడ్ లో వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ ఇప్పటికే అదే డేట్ కు బాలయ్య –బోయపాటిల అఖండ 2, పవర్ స్టార్ క్షప రెడీ గా ఉన్నాయి. దాంతో ఆ రెండు



సినిమాలతో పోటీ– ఎందుకు అందుకున్నారో ఏమో విశ్వంభరను మరోసారి వాయిదా వేసేందుకు రెడీ అయ్యారు. విశ్వంభర సెప్టెంబర్ రేస్ నుండి తప్పుకుని డిసెంబరుకు వెళ్తోంది. రాజాసాబ్ సంక్రాంతికి వెళ్లే అవకాశం ఉంది.

## మెగాస్టార్ తో స్టెప్పులేసిన మౌని రాయ్



మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో వస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' షూటింగ్ పూర్తయింది. దర్శకుడు వశిష్ట ఈ చిత్రాన్ని కియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్‌లతో కలిసి ఎపిక్ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. చిత్ర బృందం తెలిపిన వివరాల ప్రకారం, చిరంజీవి –మౌని రాయ్‌లపై చిత్రీకరించిన భారీ డ్యాన్స్ నెంబర్‌తో సినిమా షూటింగ్ పూర్తి అయింది. ఈ హై ఎనర్జీ సాంగ్‌కు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, శ్యామ్ కాసర్ల సాహిత్యం రాశారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com